TGTEL/25/A0827

# ప్రజా దివాస్

తెలుగు దినపత్రిక

prajadivvs57@gmail.com

విలేఖరులు కావలెను

అసలైన అక్షర జ్ఞానాన్ని తెలియజేస్తూ ... విలువలతో కూడిన జీవన శైలిలో ప్రేరణ కలిగించే విషయాలపై అవగాహన కలిగిస్తూ ... ప్రజల సాధకబాధకాల్లో మమేకమై పరిష్కార మార్గాలపై ప్రేరణ కలిగించాలి అనుకుంటున్నారా.. ? బాధ్యతయుతమైన జర్నలిజంలో రాణించాలనుకుంటున్నారా ... ? అయితే రండి ... అక్షరాన్ని అనుకున్న విధంగా రాద్దాం..

సెల్ : 9440060406

నియోజకవర్గ ఇంచార్జ్‌లు, జిల్లా స్టాఫర్‌లు మండల రిపోర్టల్‌లు కావలెను...

సంపుటి : 3 సంచిక : 140 | గురువారం 14-05-2026 | ఎడిటర్: ఎస్ ఎన్ డి మౌనిక రవికుమార్ | పేజీలు : 8 వెల 3 /-

## రెండు వాహనాల కాన్వాయ్‌తోనే

# మోదీ ప్రయాణం



దిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్య భారీగా తగ్గింది. రెండు వాహనాల కాన్వాయ్ తోనే ఆయన ప్రయాణించారు. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా ఈ మేరకు మార్పులు చేశారు. పశ్చిమాసియాలో సంక్షోభం నేపథ్యంలో దేశ ప్రజలకు పొదుపు మంత్రం పాటించాలని సూచించిన ప్రధాని మోదీ.. స్వయంగా వాటిని పాటిస్తున్నారు. ఈక్రమంలోనే తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించారు.

పేజి 2లో

- తమిళనాడు సీఎం విజయ్ బలపరీక్షలో విజయం
- విజయ్ ప్రభుత్వానికి 144 మంది ఎమ్మెల్యేల మద్దతు
- వ్యతిరేకంగా 22 ఓట్లు నమోదు
- బలపరీక్ష సమయంలో డీఎంకే సభ్యుల వాకౌట్
- కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ టీవీకేకు మద్దతు
- అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలూ విజయ్‌కే అనుకూలం
- ఎమ్మెల్యేల కొనుగోలు ఆరోపణలు చేసిన పళనిస్వామి

# బలపరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్



తమిళనాడు నూతన ముఖ్యమంత్రిగా ఎన్నికైన టీవీకే అధినేత విజయ్ శాసనసభలోనూ తన బలాన్ని నిరూపించుకున్నారు. బుధవారం జరిగిన బలపరీక్షలో విజయ్ ప్రభుత్వం స్పష్టమైన మెజార్టీతో నెగ్గింది. బలపరీక్షకు సంబంధించి ఈ ఉదయం విజయ్ సభలో తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై చర్చ చేపట్టిన అనంతరం స్పీకర్ ఓటింగ్ నిర్వహించారు. ఇది ఆసక్తికరంగా సాగింది. సాధారణ ఓటింగ్ మాదిరిగా కాకుండా.. ఒక్కో సభ్యుడి పేరు పిలుస్తూ ఎమ్మెల్యేల సమ్మతిని సభాపతి నమోదు చేసుకున్నారు.ఇందులో విజయ్ ప్రభుత్వానికి మద్దతుగా 144 మంది ఎమ్మెల్యేలు ఓటేశారు. 22 మంది సభ్యులు వ్యతిరేకించారు. బలపరీక్ష సమయంలో అసెంబ్లీ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు. టీవీకే ప్రభుత్వానికి కాంగ్రెస్, వీసీకే, ఐయూఎంఎల్ పార్టీలు మద్దతిచ్చాయి. అన్నాడీఎంకే రెబల్ ఎమ్మెల్యేలు కూడా సీఎంకు అనుకూలంగా ఓటేశారు.

పేజి 2లో ▶

## హైదరాబాద్‌లో

# ఊబర్ ఎక్సలెన్స్ సెంటర్

## ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్త్రోషాహి వెల్లడి**



**ఫ్యూచర్ సిటీలో ఊబర్ కార్పొరేట్ ఆఫీస్**

**సీఎం రేవంత్‌రెడ్డితో భేటీలో సీఈవో దారా ఖోస్రోషాహి వెల్లడి**

హైదరాబాద్, మే 13: ప్రపంచ ప్రఖ్యాత రైడ్ షేరింగ్ సంస్థ ఊబర్ హైదరాబాద్‌లో విస్తరణకు సన్నాహాలు చేస్తోంది. ఫ్యూచర్ సిటీలో తన కార్పొరేట్ ఆఫీసును ఏర్పాటు చేయనున్నట్లు సంస్థ సీఈవో దారా ఖోస్రోషాహి తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఆయన సమావేశమయ్యారు.

### హైదరాబాద్‌కే ఊబర్ ప్రాధాన్యం

హైదరాబాద్‌లో సాంకేతిక నైపుణ్యం, ప్రతిభకు కొరతలేదని, అందుకే ఇక్కడ ఎక్సలెన్స్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు దారా ఖోస్రోషాహి తెలిపారు. ఈ కేంద్రం ద్వారా ఆవిష్కరణలు, ఇంజినీరింగ్, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ వంటి కీలక రంగాల్లో సేవలు అందించనున్నట్లు చెప్పారు.

### ఉద్యోగాల వెల్లడి

ఈ ఎక్సలెన్స్ సెంటర్ ద్వారా వేల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు లభించనున్నట్లు అధికారులు తెలిపారు.

### రాష్ట్రానికి పెట్టుబడులు

తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న ప్రోత్సాహం, పారిశ్రామిక అనుకూల వాతావరణం తమ నిర్ణయానికి కీలకమని సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

### సీఎం రేవంత్‌రెడ్డి స్పందన

ఊబర్ విస్తరణతో తెలంగాణ ప్రపంచ స్థాయి టెక్నాలజీ హబ్‌గా మరింత ఎదుగుతుందని సీఎం రేవంత్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

హైదరాబాద్‌లో ఉబర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను విస్తరిస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి ఉబర్ సీఈవో తెలిపారు. అమెరికా వెలుపల ఏర్పాటు చేసిన ఈ మొదటి సెంటర్‌లో 600 మంది ఇంజనీర్లు పనిచేస్తున్నారని సీఈవో వివరించారు. భారత్ ఫ్యూచర్ సీటీలో ఉబర్ కార్పొరేట్ ఆఫీస్ నిర్మాణానికి ఆసక్తి చూపించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో జూబ్లీహిల్స్ నివాసంలో ఉబర్ సంస్థ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ దారా ఖోస్రోషాహి బుధవారం సమావేశం అయ్యారు. ఈ భేటీలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సమావేశంలో ఉబర్ చీఫ్ బిజినెస్ ఆఫీసర్ మధు కన్నన్, ఉబర్ ఇండియా, సౌత్ ఆసియా ప్రెసిడెంట్ ప్రభ్‌జీత్ సింగ్, చీఫ్ టెక్నాలజీ ఆఫీసర్ ప్రవీణ్ నిప్పల్లి నాగ, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి పాల్గొన్నారు. ఉబర్ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి ముందుకు సాగుతామని సీఈవో ఖోస్రోషాహి స్పష్టం చేశారు.పార్కింగ్ వ్యాపారంలోకి వచ్చే అంశాన్ని పరిశీలించాలని ఉబర్ సీఈవోకి సూచించారు ముఖ్యమంత్రి. దేశంలోని ప్రముఖ నగరాల్లో పార్కింగ్ సమస్యను ఉబర్ ప్రతినిధుల దృష్టికి తీసుకువచ్చారు సీఎం. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా మల్టీ లెవల్ పార్కింగ్ సెంటర్లు ఏర్పాటు చేస్తే బాగుంటుందని సూచించారు. సీఎం సూచనపైన సమగ్ర అధ్యయనం చేస్తామని ఉబర్ ప్రతినిధులు తెలిపారు. వ్యాపార విస్తరణకు అన్నివిధాలుగా రాష్ట్ర ప్రభుత్వం సహకరిస్తుందని ఉబర్ ప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

మిగతాది 2లో

# క్రైమ్‌లో

## తెలంగాణ రైజింగ్

# రైతుల ఖాతాల్లోకి రూ. 4,520 కోట్లు

### 30 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు

### పౌరరఫరాల శాఖ అధికారుల వెల్లడి

2025–26 రబీ సీజన్‌లో వరి ధాన్యం కొనుగోళ్లను సజావుగా మరియు సమర్థవంతంగా నిర్వహించేందుకు పౌరసరఫరాల శాఖ పూర్తి సామర్థ్యంతో పనిచేస్తోంది.

2లో

## చెట్టును ఢీకొట్టిన బొలెరో.. ఒకరి మృతి, 29 మందికి గాయాలు



మిగతాది 2లో

## హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్..

# గిరిపుత్రుల్లో ఆనందం

- పెదపాడులో కొత్త పాఠశాల భవనం నిర్మాణం పూర్తి
- ఇచ్చిన హామీని నిలబెట్టుకున్న ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్
- రూ.17.50 లక్షల వ్యయంతో ఆధునిక భవనం నిర్మాణం
- గతేడాది అడవితల్లి బాట కార్యక్రమంలో హామీ
- శిథిలావస్థలో ఉన్న పాత స్కూలును పరిశీలించిన పవన్
- ఉపాధ్యాయుల విజ్ఞప్తికి వెంటనే స్పందన
- 2026 విద్యా సంవత్సరం నుంచి విద్యార్థులకు అందుబాటులోకి భవనం
- పవన్‌కు కృతజ్ఞతలు తెలిపిన పెదపాడు గ్రామస్థులు



మిగతాది 2లో

# రజనీకాంత్ స్పీచ్..


యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు.

# మంత్రి లోకేశ్ ఫిదా!



అమరావతి: బెంగుళూరులో జరిగిన 'ఆర్ట్ ఆఫ్ లివింగ్' కార్యక్రమంలో ప్రముఖ సినీనటుడు రజనీకాంత్ చేసిన ప్రసంగానికి మంత్రి నారా లోకేశ్ ఫిదా అయ్యారు. యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉందంటూ ఎక్స్‌లో పోస్టు చేశారు."ఇవాళ ఉదయం లేవగానే మీ స్పీచ్ విన్నాను. అందులోని ప్రతి అంశం నాకు బాగా నచ్చింది. ఉన్నతస్థానంలో ఉన్న మీరు హుందాగా, వినయంగా స్టార్‌డమ్‌ను స్వీకరించే విధానం చూస్తుంటే ఆశ్చర్యమేస్తోంది. యువతరం మీ నుంచి చాలా నేర్చుకోవాల్సి ఉంది" అని పోస్టు పెట్టారు.

పేజి 2లో ▶



# పొదుపు సూత్రాలు తెలంగాణకు

- నిధులు మాత్రం ఆంధ్రాకా ..?
- ప్రధాని తీరుపై మండిపడ్డ కవిత
- భగీరథ్ పారిపోకుండా లుకౌట్ నోటీసులు ఇవ్వాలని డిమాండ్

మిగతాది 2లో

ప్రజా దివాన్ తెలుగు దినపత్రిక
గురువారం 14-05-2026

# సంపాదకీయం

## దక్షిణాపథంలో బీజేపీ జైత్రయాత్ర ఎప్పుడు?

కోల్‌కతాలోని బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్‌లో కొన్ని దశాబ్దాల పాటు ఎర్ర కెరటాలు ప్రతి ఏటా ఉప్పొంగేవి. కానీ ఈ మే 9న కాషాయ అలలు పరవళ్లు తొక్కాయి. ప్రధానమంత్రి మోదీ, వేలాది ప్రజల సమక్షంలో సువేందు అధికారి బీజేపీ తొలి ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. సరిగ్గా ఒక రోజు తర్వాత ఆదివారంనాడు దక్షిణాదిన చెన్నైలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో సినీనటుడు చంద్రశేఖరన్ జోసెఫ్ విజయ్ జాతీయ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ సమక్షంలో తమిళనాడు 9వ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. విజయ్ పట్టాభిషేకానికీ అంతే భారీ సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. హిందీ మాట్లాడే రాష్ట్రాల్లో బలంగా వేళ్లూనుకుని, పశ్చిమాన గుజరాత్, మహారాష్ట్రల్లో, ఈశాన్య రాష్ట్రాలైన అసోం, అరుణాచల్ ప్రదేశ్, మణిపూర్, త్రిపురలో, తూర్పు, కోస్తా ప్రాంతంలో తొలుత ఒడిషా, ఇప్పుడు బెంగాల్‌లో విస్తరించిన భారతీయ జనతా పార్టీ దక్షిణాదిలో అడుగుపెట్టడం అంత సులభం కాదని ఈ పరిణామం స్పష్టం చేస్తోంది. అటు సువేందు అధికారి, ఇటు జోసెఫ్ విజయ్ ఈ పరిణామాలకు ప్రతిఫలనాల్లా కనిపిస్తున్నారు. ఈ రెండు ఘట్టాలు భారత దేశ ప్రజల ఆలోచనా దృక్పథంలో రెండు భిన్న కోణాలను ప్రతిబింబిస్తున్నాయా?

బెంగాల్‌లో సువేందు అధికారి పక్కన నిలబడిన నరేంద్రమోదీ ఇప్పుడు దక్షిణాదిలో విస్తరించేందుకు ఉవ్విళ్లూరుతుంటే, కేరళలో విజయం సాధించి, జోసెఫ్ విజయ్ పక్కన నిలబడ్డ రాహుల్‌గాంధీ ఉత్తరాదిలో పూర్వవైభవాన్ని సంతరించుకునేందుకు ఎన్ని యత్నాలు చేసినా ఫలితాలు సాధించలేకపోతున్నారు. ఒకప్పుడు కాంగ్రెస్‌ను ప్రతిఘటించిన దక్షిణాది రాష్ట్రాలు బీజేపీని ఏమంత ఆహ్వానించలేదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల్లో బీజేపీ ప్రవేశించేందుకు చేయని ప్రయత్నం లేదు. అమలు చేయని ప్రయోగం అంటూ లేదు.

ఏపీలో తెలుగుదేశం ఆధిపత్యాన్ని అంగీకరించిన బీజేపీ కర్ణాటకలో ఉన్న అధికారాన్ని కోల్పోయి, మళ్లీ పట్టుకోసం నానా యత్నాలు చేస్తోంది. తమిళనాడులో స్వంతంగా బలపడడం కష్టమని గ్రహించిన తర్వాత మళ్లీ అన్నాడీఎంకేతో చేతులు కలపక తప్పలేదు. కేరళలో ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మొదటిసారి 3 సీట్లు సాధించిన బీజేపీ ఓట్ల శాతం మాత్రం గతంతో పోలిస్తే ఏమంత పెరగలేదు. కేరళ, తమిళనాడులో బీజేపీ ప్రవేశించడం సుదూర స్వప్నమైతే అవకాశం ఉన్న రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ మాత్రమే. అందుకే ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఈ రెండు రాష్ట్రాల్లో పర్యటించారు. అయితే కర్ణాటక, తెలంగాణల్లో మోదీ పర్యటన భిన్న రీతుల్లో సాగింది. కర్ణాటకలో జాతీయవాద రాజకీయాలవైపు ప్రజలు మొగ్గుచూపుతున్నారని, త్వరలో కాషాయ ప్రభంజనం ఆ రాష్ట్రంలో వీస్తుందని చెప్పిన మోదీ తెలంగాణలో మాత్రం ఆ విశ్వాసాన్ని ప్రకటించలేదు.

1984లో దేశ వ్యాప్తంగా కేవలం బీజేపీ గెలుచుకున్న రెండు స్థానాల్లో ఒకటి గుజరాత్‌లోని మెహసానా కాగా, రెండవది తెలంగాణలో హన్మకొండ. ఇప్పుడు గుజరాత్‌తో పాటు దేశంలోని అనేక రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలోకి రాగా, తెలంగాణలో మాత్రం అనుకున్నంతమేరకు విస్తరించలేకపోతోంది. ఈ విషయాన్ని స్వయంగా మోదీయే రాష్ట్ర నేతల దగ్గర ప్రస్తావించి వారిని విమర్శించారు. బండి సంజయ్ అధ్యక్షుడుగా ఉన్నప్పుడు బీజేపీ కేడర్‌లో కొంత ఊపు వచ్చింది కాని ఆ తర్వాత ఆ ఉత్సాహం క్రమంగా నీరుకారిపోయింది. సంఘ్ పరివార్ సంస్థలైతే హిందుత్వ దిశగా ప్రజల్ని మళ్లించగలవు కాని రాజకీయంగా ప్రజల్లో కదలిక తేవాల్సింది బీజేపీ నేతలే. మోదీ తాజా పర్యటనలో బీజేపీ నేతలకు బహిరంగంగా ఎలాంటి దిశానిర్దేశం చేయలేదు. ఉత్తరాది, బెంగాల్‌లో అవలంబించిన పద్ధతులు దక్షిణాదిన పనిచేయవని ఆయనకు తెలుసు. అయితే తెలంగాణకు సంబంధించి మోదీ వద్ద ఏదో వ్యూహమే ఉన్నట్లు ఆయన మాటలు, సమావేశాలు అనుమానాలు కలిగిస్తున్నాయి. అదేమిటో కాలమే చెబుతుంది.

బెంగాల్‌లో బీజేపీ విజయంతో మమతా బెనర్జీ తర్వాత కమలనాథులను ఢీకొనగల శక్తులంతా ఒక్కొక్కరూ మాయవుతున్నట్లు కనిపిస్తోంది. అదే సమయంలో జాతీయ పార్టీ కాంగ్రెస్ అయినా కనీసం బీజేపీని ఢీకొనగలదా అన్న ప్రశ్న తలెత్తుతోంది. బీజేపీకి వ్యతిరేకంగా ప్రతిపక్షాలను ఐక్యం చేసేందుకు ప్రయత్నించిన నాయకులు అందరూ ఒక్కొక్కరూ కుప్పకూలిపోయారు. నితీశ్‌కుమార్, మమతా బెనర్జీ, ఎంకే స్టాలిన్, కేసీఆర్, శరద్‌పవార్, కేజ్రీవాల్, ఉద్ధవ్ ఠాక్రే అందరూ మోదీని వ్యతిరేకించి ప్రతిపక్షాలను ఏకం చేయాలనుకున్నవారే. 2023లో ప్రతిపక్షాలను ఏకం చేసేందుకు తీవ్ర యత్నాలు చేసిన నితీశ్ తర్వాత అధికారం కోసం బీజేపీ వైపు మళ్లి, ఇప్పుడు బీజేపీకే అధికారాన్ని వదులుకున్నారు. దేశంలో ప్రత్యామ్నాయ రాజకీయాలు చేయగలిగిన నేతల నందరినీ మోదీ చతుర్విధోపాయాలు ఉపయోగించి పక్కకు తప్పించారు. వీరెవరూ జాతీయ స్థాయిలో ఇప్పుడు మోదీని ఎదుర్కోగలిగేందుకు చేయగలిగింది ఏమీ లేకపోగా, రాష్ట్ర స్థాయిలో మనుగడకు పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మహారాష్ట్రలో శివసేన, ఎన్సీపీని చీల్చి ప్రాబల్యం సంపాదించిన బీజేపీ ఆమ్ ఆద్మీ పార్టీలో కూడా తిరుగుబాటును ప్రేరేపించింది. తమిళనాడులో కొత్త శక్తి ఆవిర్భవించినప్పటికీ లోక్‌సభ ఎన్నికలు జరిగే వరకు ఈ శక్తి తన బలం ఎంతమేరకు పుంజుకుంటుందో ఇప్పుడే చెప్పలేం. వామపక్షాలకు ఉన్న ఏకైక ప్రభుత్వం ఇప్పుడు కాంగ్రెస్ వశమైంది. పార్లమెంటులో వామపక్షాల ఉనికి క్రమంగా క్షీణించిపోతోంది. ప్రాంతీయ పార్టీలు, వామపక్షాలు బలహీనపడంతో బీజేపీని కాంగ్రెస్ మాత్రమే ఒంటరిగా ఎదుర్కోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. బహుశా బీజేపీ కూడా అదే కోరుకుంటుందేమో. బీజేపీ వ్యతిరేక రాజకీయాలు బలహీనపడడమో, ఆవశ్యకత కోల్పోవడమో స్పష్టంగా కనపడుతోంది. అది నాయకత్వస్థాయిలోనూ, సైద్ధాంతిక స్థాయిలోనూ ప్రస్ఫుటిస్తోంది. దానివల్ల దక్షిణాదిలో కూడా బీజేపీతో చేతులు కలిపేందుకు, దాని రాజకీయ సిద్ధాంతాన్ని ఆమోదించేందుకు పార్టీలు ఏ మాత్రం వెనుకాడడం లేదు. బీజేపీ వ్యతిరేకత సోషల్ మీడియా కాగితపు పులులకు మించి జనంలోకి వ్యాపించేందుకు ఎంత సమయం పడుతుందో చెప్పలేము.

స్వాతంత్ర్యం తర్వాత దశాబ్దాలపాటు రాజ్యమేలిన కాంగ్రెస్ ఆ తర్వాత క్రమంగా బలహీనపడింది. అప్పుడు జనసంఘ్, బీజేపీ పరిస్థితి ఏ విధంగా ఉన్నదో ఇప్పుడు కాంగ్రెస్ పరిస్థితి కూడా అదే విధంగా మారింది. కేవలం రెండేళ్లలో బీజేపీ తూర్పున ఒడిషా, బిహార్, పశ్చిమబెంగాల్‌లో అధికారంలోకి రాగలిగింది. అసోంలో మూడోసారి అధికారాన్ని చేజిక్కించుకుంది. పశ్చిమాన రాజస్థాన్, గుజరాత్, మహారాష్ట్రలో బీజేపీకి స్వంత ముఖ్యమంత్రులున్నారు. గుజరాత్‌లో 30 ఏళ్లుగా బీజేపీ అధికారంలో ఉన్నది. ఒక్క జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్ తప్ప హిందీ బెల్ట్ అంతటా బీజేపీ ముఖ్యమంత్రులున్నారు. పంజాబ్‌లో కూడా ఇప్పటికే బీజేపీ చాపక్రింద నీరులాగా ప్రవేశించేందుకు పథకాలు మొదలుపెట్టింది. ఉత్తర, తూర్పు, పశ్చిమాన ఆధిపత్యం నిరూపించుకోగలిగిన బీజేపీకి దక్షిణాదిలో ప్రవేశించడం అసాధ్యమా?

అయితే ఎన్నికల రాజకీయాల్లో బీజేపీ ఎంత తలపండిపోయిందంటే ఆ పార్టీని ఓడించడం అసాధ్యమనే స్థితి ఏర్పడింది. ఎన్నికల్లో బీజేపీ విజయ సూత్రాన్ని ఎవరూ ఛేదించలేకపోతున్నారు. గెలిచేందుకు ఏ సాధనాన్ని బీజేపీ వదిలిపెట్టదు, అది నైతికమా, అనైతికమా అన్న చర్చతో ఆ పార్టీకి నిమిత్తం లేదు. 'సర్' వల్ల 31 స్థానాల్లో బీజేపీ తమపై గెలిచిందని తృణమూల్ కాంగ్రెస్ నేతలే అంగీకరించినందువల్ల మిగతా స్థానాల్లో గెలిచేందుకు బీజేపీ ఇతర వ్యూహాలు ప్రయోగించి ఉండాలి.

ఏ పార్టీకైనా ఎల్లకాలమూ శిఖర స్థాయిలో ఉండడం సాధ్యం కాదు. బీజేపీ ఆ స్థాయి కోల్పోవాలంటే తన పతనానికి తానే కారణం కావాలి. ఆ పార్టీని గద్దెదించగల ప్రత్యామ్నాయ రాజకీయ శక్తి ఆవిర్భవించాలి. ప్రజలు అడుగడుగునా వ్యతిరేకించగల పరిస్థితులు రావాలి. ఈ మూడూ సమీప భవిష్యత్తులో జరిగే అవకాశాలు కనపడడం లేదు. సాధారణంగా ప్రభుత్వ పాలన పట్ల కనపడే వ్యతిరేకతను కూడా బీజేపీ అధిగమించింది. ప్రభుత్వ వ్యతిరేకతను తటస్థం చేయడంలో బీజేపీ నేతలు దిట్టలు. అసోంలో రెండుసార్లు అధికారంలో ఉన్న తర్వాత కూడా కాంగ్రెస్ బీజేపీని

# రజనీకాంత్ స్పీచ్.. మంత్రి లోకేశ్ ఫిదా!

మొదటిపేజీ తరువాయి

**రజనీకాంత్ ఏమన్నారంటే?**

"హిమాలయాల తర్వాత ఈ ఆశ్రమం నాకు ఎంతో నచ్చింది. నిజానికి నేను ఇక్కడ రెండ్రోజులు ఉందామని ప్లాన్ చేశాను. కానీ 15 రోజులు ఉండిపోయాను. ఒక రోజు సాయంత్రం ఆశ్రమంలో భక్తులు వేల సంఖ్యలో ఉన్నారు. అప్పుడు గురుదేవ్ (శ్రీ శ్రీ రవిశంకర్) పిలుపు మేరకు నేను కూడా ఆయనతో కలిసి వేదికపైకి వెళ్లాను. నేను మీతో వస్తే మీకు డిస్టర్బ్ అవుతుంది కదా అని అడిగితే, ఆయన ఏం ఫర్లేదు అన్నారు. అక్కడున్న వేల మంది జనాన్ని, ముఖ్యంగా ఎంతో మంది తమిళ భక్తులను చూసి కొంచెం కంగారు పడ్డాను. అందరూ నన్ను చుట్టుముట్టేస్తారేమో, ఫొటోలు, ఆటోగ్రాఫ్‌ల కోసం వెంటబడతారేమో అని భయపడ్డాను. కానీ, ఆశ్చర్యంగా, ఒక్కరు కూడా నన్ను పట్టించుకోలేదు. అందరి దృష్టి గురుదేవుల మీద మాత్రమే ఉంది. నేను హాయ్ అని చేతులు ఊపినా ఎవరూ చూడలేదు. నా జీవితంలో ఎంతో మంది రాజకీయ నాయకులను, పారిశ్రామికవేత్తలను చూశాను, కానీ, ఇంతటి అనుభవం ఎప్పుడూ కలగలేదు. అది నా గర్వాన్ని (ఈగోని) పూర్తిగా అణచివేసింది. అప్పుడు అర్థమైంది, సెలబ్రిటీ హోదా అనేది వస్తుంటుంది, పోతుంటుంది. కానీ ఆధ్యాత్మికతలో ఉండే ఈ హోదానే అత్యున్నతమైనది" అని రజనీకాంత్ అన్నారు.

## అమరావతే కాదు.. విశాఖనూ విశ్వనగరం చేస్తున్నాం: సీఎం చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి

ప్రపంచంలో ప్రతి ముగ్గురు వైద్యుల్లో ఒకరు ఇక్కడి నుంచే ఉండాలి. డిసెంబరు నాటికి భారత్‌లో క్వాంటం కంప్యూటింగ్‌కు చిరునామాగా అమరావతి అవుతుంది.

విదేశాలపై ఆధారపడకుండా గ్రీన్ ఎనర్జీని మన రాష్ట్రంలోనే ఉత్పత్తి చేసుకునేలా కార్యాచరణ రూపొందిస్తున్నాం. ప్రతి పొలంలో, ఇంటిపైనా సోలార్ రూఫ్‌టాప్ లాంటి విద్యుదుత్పత్తి కేంద్రాలు తీసుకొస్తాం. పశ్చిమాసియా యుద్ధం వల్ల పెట్రోల్, గ్యాస్, డీజిల్ కొరత వచ్చింది. భవిష్యత్తులో వర్క్‌ఫ్రమ్ హోం వస్తుంది.. ప్రభుత్వంలో కూడా తీసుకొస్తాం. 10 కార్లతో కాన్వాయ్‌గా రావడం ఫ్యాషనైంది.. సెక్యూరిటీ అర్థవంతంగా ఉండాలి. హాలిడే వస్తే విదేశాలకు వెళ్తున్నారు. మంచి పర్యాటక ప్రదేశాలు మన దేశంలోనే ఉన్నాయి. అరకు, పాపికొండలు, గండికోట వంటి ప్రదేశాలు మన రాష్ట్రంలో ఉన్నాయి. గోవాను మించిన టూరిజం కేంద్రంగా సూర్యలంక మారుతుంది." అని సీఎం అన్నారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# పొదుపు సూత్రాలు తెలంగాణకు

మొదటిపేజీ తరువాయి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణకు వచ్చి పొదుపు సూత్రాలు చెప్పారని.. డబ్బులు మాత్రం ఏపీకి ఇచ్చారని తెలంగాణ రక్షణ సేన(టీఆర్ఎస్) అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యానించారు. బుధవారం మీడియాతో కవిత మాట్లాడుతూ.. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుటుంబ సభ్యులు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని.. ప్రధాని సభా వేదికను బండి సంజయ్ పంచుకోకుంటే బాగుండేదని అన్నారు. ప్రధాని పర్యటనలో కేంద్ర మంత్రి పాల్గొనడం వల్ల ప్రజల్లోకి తప్పుడు సంకేతం వెళ్లిందన్నారు. బండి సంజయ్ కుమారుడు దేశం దాటి పోకుండా తెలంగాణ పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేయాలని కవిత అన్నారు. బండి సంజయ్ కుమారుడు తప్పు చేసినట్లు రుజువు అయితే కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఆడపిల్ల జీవితం నాశనం అయ్యే విధంగా సోషల్ మీడియాలో వీడియోలు పోస్ట్ చేసిన వారిని అరెస్ట్ చేయాలని.. సోషల్ మీడియా అకౌంట్స్ బ్లాక్ చేయాలన్నారు. బాధితురాలి వీడియోలను సోషల్ మీడియాలో షేర్ చేయాల్సిన అత్యుత్సాహం బీఆర్ఎస్ పార్టీకి ఎందుకని ప్రశ్నించారు. బీసీ రిజర్వేషన్లపై ప్రధాని మోదీ మాట్లాడలేదని టీఆర్ఎస్ అధ్యక్షురాలు అన్నారు. పాలమూరు - రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా ఇవ్వాలన్నారు. పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు జాతీయ హోదా కోసం కేంద్ర ప్రభుత్వానికి సీఎం రేవంత్ రెడ్డి లేఖ రాయాలన్నారు. ఏపీ సీఎం చంద్రబాబు పోలవరం పూర్తి చేయాలని కేంద్ర మంత్రిని కలిశారని.. పోలవరం ప్రాజెక్ట్‌ను 5 సార్లు సందర్శించారని తెలిపారు. కానీ తెలంగాణ సీఎం రేవంత్ ఇప్పటి వరకు ఒక్కసారి కూడా పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్ట్‌కు వెళ్లలేదని విమర్శించారు. ఏపీ నీటి వనరులను సద్వినియోగం చేసుకుంటోందన్నారు. తెలంగాణ రక్షణ సేన అధికారంలోకి వస్తే వాటర్ కమిషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. చెక్ డ్యామ్‌లు కట్టి నీటి వనరులను సద్వినియోగం చేస్తామని తెలిపారు. ప్రధాని పర్యటనపై బీఆర్ఎస్ ఒక్క మాట మాట్లాడలేదని విమర్శించారు. ÷ఎలగణనలో ఓబీసీ కాలమ్ పెట్టాలని కవిత డిమాండ్ చేశారు. బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు సాధించడానికి దేశం మొత్తం తిరుగుతామని చెప్పారు. పోలవరం, బనకచర్లపై రిట్ పిటిషన్ వేయనున్నట్లు కవిత తెలిపారు. దీనిపై కేంద్ర మంత్రి సీఆర్ పాటిల్‌ను కలిసి వినతి పత్రం ఇస్తామన్నారు. నీట్ లాంటి జాతీయ పరీక్ష పేపర్ల లీక్ ఘటన అంశాన్ని కేంద్ర ప్రభుత్వం సీరియస్‌గా తీసుకోవాలన్నారు. విద్యార్థుల జీవితాలతో ఆటలు ఆడుకోవద్దని హెచ్చరించారు. టీఆర్ఎస్ జెండా పండుగలో తాను పాల్గొంటానని తెలిపారు. తెలంగాణ రాజకీయ శూన్యతను భర్తీ చేయడానికి తెలంగాణ రక్షణ సేన పుట్టిందని కవిత పేర్కొన్నారు.

# రైతుల ఖాతాల్లోకి రూ. 4,520 కోట్లు

మొదటిపేజీ తరువాయి

ఇప్పటి వరకు విజయవంతంగా 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసింది. పౌరసరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, మార్గదర్శకత్వంలో, రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తూ ఎలాంటి జాప్యం లేకుండా కనీస మద్దతు ధర కింద రూ. 4,520 కోట్లను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేసింది. ల్గ÷తులు సన్న మరియు దొడ్డు రకాల ధాన్యాన్ని భారీగా కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా 9 లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకం ధాన్యాన్ని కొనుగోలు చేయగా, మిగిలిన 21 లక్షల మెట్రిక్ టన్నుల మేర దొడ్డురకం ధాన్యాన్ని సేకరించడం జరిగింది. ÷-రస్తుతం ధాన్యం కొనుగోళ్లు ముమ్మరంగా సాగుతున్న నేపథ్యంలో, భారీగా వస్తున్న ధాన్యాన్ని సేకరించేందుకు అన్ని జిల్లాల్లో కలిపి మొత్తం 8,575 ధాన్యం కొనుగోలు కేంద్రాలు చురుగ్గా పనిచేస్తున్నాయి. ఈ విస్తృతమైన క్షేత్రస్థాయి వ్యవస్థలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో 4,350 కేంద్రాలు, ఐకేపీ ఆధ్వర్యంలో 3,563 కేంద్రాలు, మరియు ఇతర అనుబంధ సంస్థల ద్వారా 662 కేంద్రాలు నడుపబడుతున్నాయి. కొనుగోలు కార్యకలాపాలు సజావుగా సాగడానికి మరియు కేంద్రాలకు వస్తున్న ధాన్యాన్ని పూర్తిగా సంరక్షించడానికి, పౌరసరఫరాల శాఖ ముందస్తుగానే ఈ కేంద్రాల వద్ద 18.6 కోట్ల గన్నీ బ్యాగ్‌లను మరియు తగిన సంఖ్యలో టార్పాలిన్లను సిద్ధంగా ఉంచింది. క్షేత్రస్థాయిలో నిల్వల సమస్య తలెత్తకుండా మరియు కొనుగోలు కేంద్రాలు ప్రతిరోజూ కొత్త ధాన్యాన్ని స్వీకరించడానికి సిద్ధంగా ఉండేలా, పౌరసరఫరాల శాఖ వేగవంతమైన రవాణా కార్యకలాపాలను అమలు చేస్తోంది. కొనుగోలు చేసిన ధాన్యాన్ని జాప్యం లేకుండా నేరుగా కేంద్రాల నుండి మిల్లులకు తరలించడానికి లారీలు, ట్రాక్టర్లు, డీసీఎంలతో కూడిన సుమారు 11,500 రవాణా వాహనాలను అందుబాటులో ఉంచింది. అంతేకాకుండా, లోడింగ్ మరియు అన్‌లోడింగ్ ప్రక్రియలను దగ్గరుండి పర్యవేక్షించడానికి, పారదర్శకతను నిర్ధారించడానికి కొనుగోలు కేంద్రాలతో పాటు మిల్లుల వద్ద కూడా ప్రత్యేక అధికారులను వ్యూహాత్మకంగా నియమించింది. హమాలీల కొరతను అధిగమించడానికి, భారీగా వస్తున్న ధాన్యాన్ని సజావుగా నిర్వహించడానికి మరియు రైతుల ప్రయోజనాలను కాపాడుతూ కొనుగోళ్లను వేగవంతం చేయడానికి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. కొనుగోలు కేంద్రాలు మరియు గోదాములలో ధాన్యం నిర్వహణ ఛార్జీలను అధికారికంగా క్వింటాల్‌కు రూ. 17/- కి పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ విధానాలతో

# రెండు వాహనాల కాన్వాయ్‌తోనే మోదీ ప్రయాణం

మొదటిపేజీ తరువాయి

సాధారణంగా, ప్రధాని కాన్వాయ్‌లో మెర్సిడెస్ అల్ట్రా లగ్జరీ కారు, రేంజ్ రోవర్లు, టయోటా ఫార్చ్యూనర్లు, ఎస్కార్ట్ వాహనాలు, జామర్ యూనిట్లు సహా కనీసం 12-15 వాహనాలు ఉంటాయి. ఇంధన పొదుపు చర్యల్లో భాగంగా తన అధికారిక కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను 50 శాతం తగ్గించాలని మోదీ ఆదేశించినట్లు ఉదయం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ అధికారులు వెల్లడించారు. ప్రొటోకాల్ ప్రకారం ఆయన వెళ్లే దారుల్లో తప్పనిసరి భద్రతా ఏర్పాట్లు కొనసాగిస్తామన్నారు.

**కాన్వాయ్ సైజును కుదించుకున్న కేంద్రమంత్రులు**

ఇంధన పొదుపుపై ప్రధాని మోదీ పిలుపు మేరకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా సహా పలువురు మంత్రులు తమ కాన్వాయ్ సైజును రెండు వాహనాలకు కుదించుకున్నారు. ఉత్తర్‌ప్రదేశ్ సీఎం యోగి ఆదిత్యనాథ్ సైతం కాన్వాయ్‌లోని వాహనాల సంఖ్యను తగ్గించుకున్నట్లు వెల్లడించారు.

# బలపరీక్షలో నెగ్గిన విజయ్ సర్కార్

మొదటిపేజీ తరువాయి

**అన్నాడీఎంకే జం అన్నాడీఎంకే**

అంతకుముందు చర్చ సందర్భంగా శాసనసభలో ఒకింత గందరగోళం నెలకొంది. అన్నాడీఎంకే అధినేత, మాజీ సీఎం పళనిసామి మాట్లాడుతూ.. విజయ్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. తమ ఎమ్మెల్యేలకు ఆయన డబ్బులు ఆఫర్ చేశారని ఆరోపించారు. బలపరీక్షకు ముందు తమ పార్టీ ఎమ్మెల్యేలను సీఎం కలవడం సమంజసం కాదని పేర్కొన్నారు. అన్నాడీఎంకే పార్టీ ఐక్యంగానే ఉందని.. తమ ఎమ్మెల్యేలంతా విజయ్‌కు వ్యతిరేకంగా ఓటేస్తారని పళనిస్వామి తెలిపారు. అయితే, ఈ వ్యాఖ్యలను అన్నాడీఎంకే రెబల్ వర్గం ఎమ్మెల్యేలు ఖండించారు. తామంతా విజయ్‌కే మద్దతిస్తామని రెబల్ వర్గం నేత వేలుమణి స్పష్టంచేశారు.

**రీల్ ప్రభుత్వం: ఉదయనిధి స్టాలిన్**

ఇక చర్చలో డీఎంకే ఎమ్మెల్యే ఉదయనిధి స్టాలిన్ మాట్లాడుతూ విజయ్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. "ఈ రాష్ట్రానికి రియల్ ప్రభుత్వం కావాలి. రీల్ ప్రభుత్వం కాదు. టీవీకే ప్రభుత్వానికి మెజార్టీ లేదు. మా కూటమిలోని పార్టీలు ఇప్పుడు మద్దతివ్వడం వల్లే విజయ్ గట్టెక్కగలుగుతున్నారు. ప్రభుత్వ ఏర్పాటు కోసం ఎమ్మెల్యేల కొనుగోళ్లకు పాల్పడ్డారు. దీనివల్ల రాష్ట్ర ప్రతిష్ట దెబ్బతింటోంది" అని ఉదయనిధి విమర్శించారు. అనంతరం బలపరీక్ష ఓటింగ్‌లో తాము పాల్గొనబోమంటూ సభ నుంచి డీఎంకే సభ్యులు వాకౌట్ చేశారు.

**హామీలన్నీ నెరవేరుస్తాం: విజయ్**

చివర్లో విజయ్ మాట్లాడారు. తమ ప్రభుత్వ ఏర్పాటుకు మద్దతిచ్చిన పార్టీలకు మరోసారి కృతజ్ఞతలు తెలియజేశారు. "మా ప్రభుత్వం ఐదేళ్ల పాటు ఉంటుంది. లౌకిక విధానాన్ని అవలంబిస్తూ పాలన సాగిస్తాం. గత ప్రభుత్వం అమలుచేసిన సంక్షేమ కార్యక్రమాలు కొనసాగిస్తాం. మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టిసారిస్తాం. అందరికీ సామాజిక న్యాయాన్ని అందించే బాధ్యత మాది" అని విజయ్ పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా ఓఎస్డీ నియామకంపై వచ్చిన విమర్శలపై స్పందిస్తూ.. దాన్ని పునఃసమీక్షిస్తామని తెలిపారు. ముఖ్యమంత్రికి ప్రత్యేక విధుల అధికారి (రాజకీయం)గా రిక్కి రాధన్ పండిట్ వెట్రివేల్‌ను నియమించడంపై పలు పార్టీల నుంచి వ్యతిరేకత ఎదురైంది.

234 శాసనసభ స్థానాలున్న తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో టీవీకే పార్టీ 108 స్థానాల్లో గెలుపొందింది. ఇందులో విజయ్ రెండుచోట్ల పోటీ చేశారు. డీఎంకే 59, అన్నాడీఎంకే 47 చోట్ల గెలుపొందింది. కాంగ్రెస్ 5, పీఎంకే 4, ఐయూఎంఎల్ 2, సీపీఐ 2, వీసీకే 2, సీపీఎం 2, భాజపా 1, డీఎండీకే 1, ఏఎంఎంకే 1 చోట విజయం సాధించాయి.

## హామీ నెరవేర్చిన డిప్యూటీ సీఎం పవన్..

మొదటిపేజీ తరువాయి

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదపాడులో పాఠశాల భవనం నిర్మిస్తామని ఇచ్చిన హామీని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నెరవేర్చారు. రూ.17.50 లక్షల వ్యయంతో నిర్మించిన నూతన పాఠశాల భవనం అందుబాటులోకి వచ్చినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. గతేడాది ఏప్రిల్ 7న అరకు నియోజకవర్గం పరిధిలోని డుంబ్రిగూడ మండలం, పెదపాడు గ్రామంలో అడవితల్లి బాట కార్యక్రమంలో పవన్ పాల్గొన్నారు. చాపరాయి నుంచి పెదపాడు వరకు రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసిన అనంతరం ఆ గ్రామంలో మౌలిక వసతులపై ఆరా తీశారు.

పెదపాడులో ఉన్న ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. స్కూలు భవనం శిథిలావస్థకు చేరిందని, కొత్త భవనం కావాలని ఉపాధ్యాయులు రంగయ్య.. పవన్‌కు విన్నవించారు. పాఠశాలకు కొత్త భవనం నిర్మిస్తామని పవన్ సభావేదికపై హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు పాఠశాల భవనాన్ని నిర్మించారు. 2026 విద్యా సంవత్సరం నుంచి ఇది విద్యార్థులకు అందుబాటులోకి రానుంది. ఇచ్చిన హామీని నెరవేర్చటంపై పెదపాడు గ్రామస్థులు పవన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## చెట్టును ఢీకొట్టిన బొలెరో.. ఒకరి మృతి, 29 మందికి గాయాలు

మొదటిపేజీ తరువాయి

గండేపల్లి, పెద్దాపురం: సరదాగా బంధువుల వివాహానికి వెళ్లారు. వివాహాన్ని కనులారా చూసి బంధువులతో ఆనందంగా గడిపి తిరిగి వస్తుండగా వారు వస్తున్న వాహనం అదుపుతప్పి ప్రమాదానికి గురయ్యారు. స్థానికులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దాపురం మండలం ఆర్బీ కొత్తూరు గ్రామానికి చెందిన కొల్లి సత్యవేణి, గండేపల్లి మండలం యల్లమిల్లి గ్రామానికి చెందిన పెళ్లికుమారుడి ఇంటికి పెళ్లికి వెళ్లారు.వివాహం జరిగిన తర్వాత తిరిగి వస్తుండగా నాయకంపల్లి శివారు మలుపులో ఒక్కసారిగా ఏదురుగా వచ్చిన ఆటోను తప్పించబోయే క్రమంలో బొలెరో వాహనం అదుపుతప్పి పల్టీలు కొడుతూ రోడ్డు పక్కనున్న పామాయిల్ తోటలోకి దూసుకెళ్లింది. ప్రమాదం జరిగిన సమయంలో వాహనంలో 30 మంది ఉండగా.. డ్రైవర్ సోదరుడు అనూరు గ్రామానికి చెందిన వసంత్ (13) అక్కడికక్కడే మృతి చెందాడు. మరో 29 మందికి గాయాలయ్యాయి. వారిలో 27 మందిని మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. మరో ఇద్దరు పెదాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

## క్రైమ్‌లో తెలంగాణ రైజింగ్

మొదటిపేజీ తరువాయి

**వెల్‌డన్ రాహుల్ గాంధీ అంటూ..కెటిఆర్ ట్వీట్**

తెలంగాణలో ఆడబిడ్డలపై నేరాలు పెరగడం పట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు. అత్యధిక కేసులు కలిగిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం.. మహిళలపై నేరాల్లో దేశంలోనే అగ్రస్థానానికి చేరిందని ఆరోపించారు. తెలంగాణ మహిళలపై నేరాల రేటులో దేశంలోనే మొట్టమొదటి స్థానంలో నిలిచిందని, సైబర్ నేరాలు కూడా భారీగానే పెరిగాయని విమర్శించారు.

ఈ మేరకు ట్విట్టర్ ద్వారా కేటీఆర్ మండిపడ్డారు. దేశంలోని ముఖ్యమంత్రుల్లో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్న సీఎం రేవంత్ రెడ్డి అని అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ ఇచ్చిన నివేదికను ఈ సందర్భంగా కేటీఆర్ ప్రస్తావించారు. 'దేశంలోనే ఏ ముఖ్యమంత్రికి లేనంతగా సీఎం/హోంమంత్రి రేవంత్ రెడ్డిపై అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయి.

# యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపాలి

**- వేములవాడ పట్టణ క్రీడాకారులకు ...కెసిఆర్ కప్ క్రికెట్ కిట్లను అందజేసిన చల్మెడ**

**- జిల్లాస్థాయిలో రాణించిన రన్నరఫ్ విజేతలకు నగదు బహుమతి అందించిన చల్మెడ**



వేములవాడ/ప్రజాదివాస్ మే 13

యువ క్రీడాకారులను ప్రోత్సహించడానికి కెసిఆర్ కప్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించగా ఇటీవల దిగ్విజయంగా ముగిసింది. ఇందులో భాగంగా పాల్గొన్న జట్లకు ప్రోత్సాహకంగా ఉండేందుకు వేములవాడ పట్టణంలోని 14 జట్ల క్రికెట్ క్రీడాకారులకు బుధవారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు వారి చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కెసిఆర్ కప్ తో క్రికెట్ క్రీడాకారులకు క్రీడా స్ఫూర్తి పెంపొందడమే కాకుండా గ్రామీణ స్థాయి నుండి క్రీడాకారులు తమ ప్రతిభను చాటారన్నారు. టోర్నమెంట్ లో పాల్గొన్న అన్ని జట్లకు క్రికెట్ కిట్లను అందజేసి వారికి ప్రోత్సాహంగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో ఇలాంటి క్రీడలను ప్రోత్సహించి క్రీడాకారులను వెలికి తీస్తామని తెలిపారు. యువత చెడు అలవాట్లకు బానిస కాకుండా క్రీడల పట్ల ఆసక్తి చూపేందుకు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎప్పుడు ముందున్నారని గుర్తు చేశారు. క్రికెట్ ఏ కాకుండా భవిష్యత్తులో కబడ్డీ, వాలీబాల్ టోర్నమెంట్ల నిర్వహించి క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాస్థాయిలో రాణించిన మొదటి రన్నర్ ఆఫ్ గా నిలిచిన వేములవాడ చెందిన 7, 8 వార్డ్ తిప్పాపూర్ జట్టు (వేములవాడ కమాండర్స్) ప్రోత్సాహక బహుమతిగా 1లక్ష రూపాయలను చల్మెడ గారు స్వయంగా అందించారు. అలాగే జిల్లాస్థాయిలో రెండవ రన్నరప్ గా నిలిచిన పట్టణానికి (భగవంతరావునగర్) 26, 27 వార్డులకి చెందిన జట్టు వేములవాడ రాయల్స్ కు ప్రోత్సాహక బహుమతిగా 50వేల రూపాయలను చల్మెడ గారు స్వయంగా అందించి క్రీడాకారులను ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో...ఖ౨ఎ౨ బ్యాంకు డైరెక్టర్ ఏనుగు తిరుపతి రెడ్డి, సీనియర్ నాయకులు రామతీర్థపు రాజు, నిమ్మశెట్టి విజయ్, వెంగళ శ్రీకాంత్ గౌడ్, వాసాల శ్రీనివాస్, కొండ కనుకయ్య, సిరిగిరి చందు, గూడూరు మధు, సుంకపాక రాజు, పెద్దిరాజు, హనుమంతు, లైశెట్టి మల్లేశం, అంజద్ పాషా, మామిండ్ల కనకయ్య, మంత సందీప్, ఉమర్, రాకేష్, తదితరులు ఉన్నారు.

# మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలి

**- కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలి**

**- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**






వేములవాడ/ప్రజాదివాస్ మే 13

వేములవాడ మండలంలో పలు రైస్ మిల్లులు, వేములవాడ, చందుర్తి, రుద్రంగి మండలాల్లోని కొనుగోలు కేంద్రాల తనిఖీ రైస్ మిల్లుల్లో ధాన్యం అన్ లోడింగ్ వేగవంతం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. వేములవాడ మండలం మల్లారం, మర్రిపల్లి, చందుర్తి మండలకేంద్రం, మల్యాల, మూడపల్లి, రుద్రంగిలోని కొనుగోలు కేంద్రాలు, వేములవాడ మండలం మర్రిపల్లిలోని మారుతి, మహాలక్ష్మి, మణికంఠ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ తనిఖీ చేసి, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు, రైస్ మిల్లుల యజమానులకు పలు సూచనలు చేశారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు తీసుకువచ్చే ధాన్యాన్ని జాప్యం చేయకుండా తూకం వేయాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో అన్ని కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. రైతుల నుండి ధాన్యం కొనుగోలు చేసిన వెంటనే ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని మిల్లులకు తరలించడానికి సంబంధిత కాంట్రాక్టర్లతో మాట్లాడి వాహనాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. కొనుగోలు కేంద్రాలను, మిల్లులను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల నుండి రైస్ మిల్లులకు వాహనాల ద్వారా తరలించిన ధాన్యం బస్తాలను వేగంగా దింపుకొని, తిరిగి వాహనాలను కొనుగోలు కేంద్రాలకు పంపించేలా చూడాలని రైస్ మిల్లర్ల యజమానులను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. మిల్లులకు వచ్చిన ధాన్యం అన్ లోడ్ ప్రక్రియ వేగవంతం చేయాలని ఆదేశించారు. తనిఖీలో రుద్రంగి, చందుర్తి తహసీల్దార్లు పుష్పలత, భూపతి అధికారులు ఉన్నారు.

# బక్రీద్ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా పటిష్ట భద్రతా చర్యలు: డీజీపీ శ్రీ సి.వి ఆనంద్ ఐపీఎస్

**- గోవుల అక్రమ రవాణా, గోవధ నివారణపై ప్రత్యేక దృష్టి**






రాజన్న సిరిసిల్ల జిల్లా మే 13 ప్రజా దివాస్

రాబోయే బక్రీద్ పండుగ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని రాష్ట్ర డీజీపీ సి.వి ఆనంద్ పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈమేరకు రాష్ట్రంలోని అన్ని జిల్లాల ఎస్పీలు, కమిషనరేట్ల పోలీసు అధికారులు,సంబంధిత శాఖల అధికారులతో రాష్ట్ర డీజీపీ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.బక్రీద్ పండుగను ప్రజలు ప్రశాంత వాతావరణంలో, పరస్పర సామరస్యంతో జరుపుకునేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ గారు తెలిపారు. రాష్ట్రంలో ఎక్కడా చట్టవిరుద్ధ కార్యకలాపాలు, అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.

ప్రత్యేకంగా గోవుల అక్రమ రవాణా, గోవధ వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలపై కఠిన నిఘా ఉంచాలని పేర్కొన్నారు. సంతల్లో కొనుగోలు చేసిన పశువులకు సంబంధిత పశు వైద్యాధికారులచే జారీ చేసిన ఆరోగ్య ధృవీకరణ పత్రాలు, రవాణా అనుమతి పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని స్పష్టం చేశారు.పత్రాలు లేకుండా పశువులను రవాణా చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.రాష్ట్ర సరిహద్దు తాలు,చెక్‌పోస్టులు,ప్రధాన రహదారులు,పశువుల రవాణా ఎక్కువగా జరిగే ప్రాంతాల్లో ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి 24 గంటల నిఘా కొనసాగించాలని ఆదేశించారు. అలాగే అక్రమంగా గోవులను రవాణా చేస్తున్నారనే పేరుతో కొందరు వ్యక్తులు లేదా సంఘాలు బృందాలుగా ఏర్పడి చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకోవడం, అల్లర్లు సృష్టించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. చట్టాన్ని అమలు చేసే బాధ్యత పూర్తిగా పోలీసు శాఖదేనని, ఎవరూ స్వచ్ఛందంగా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని అన్నారు.ప్రతి జిల్లాలో శాంతి కమిటీ సమావేశాలు నిర్వహించి మత పెద్దలు, స్థానిక నాయకులతో సమన్వయం పెంచాలని పేర్కొన్నారు. సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం, మత విద్వేషాలను రెచ్చగొట్టే పోస్టులు, వదంతులు వ్యాప్తి చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలని, అలాంటి పోస్టులను వెంటనే గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.పండుగ సందర్భంగా మసీదులు, ప్రార్థనా స్థలాలు, రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు మరియు ముఖ్య కూడళ్ల వద్ద అదనపు బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను డీజీపీ ఆదేశించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే ,డిఎస్పీ లు నాగేంద్రచారి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, సి.ఐ రవి, డిటిఓ లక్ష్మణ్ , రెవెన్యూ, వెటర్నరీ శాక అధికారులు పాల్గొన్నారు.

# గౌతమ బుద్ధ నేషనల్ అవార్డు గ్రహీత కు సన్మానం



ముస్తాబాద్ /మే 13 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన బహుజన టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గౌతమ బుద్ధ నేషనల్ అవార్డు గ్రహీత మార్వాడి గంగరాజును ముస్తాబాద్ మేజర్ గ్రామపంచాయతీ సర్పంచ్ మట్ట వెంకటేశ్వర రెడ్డి గ్రామపంచాయతీ కార్యాలయంలో గంగరాజు సామాజిక పరివర్తన ఉద్యమాలను నిర్వహిస్తున్నందుకు గాను శాలువాతో ఘనంగా సత్కరించారు ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు

# గుర్రం వానిపల్లిలో బస్ షెల్టర్‌ను ప్రారంభించిన ఆది శ్రీనివాస్



వేములవాడ/ప్రజాదివాస్ మే 13

వేములవాడ అర్బన్ మండలం గుర్రం వానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్‌ను బుధవారం వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామస్తులు మరియు ప్రయాణికులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఈ షెల్టర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. గతంలో సరైన నీడ లేక ఎండకు, వానకు ప్రయాణికులు పడిన కష్టాలు నేటితో తీరిపోతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, పెద్ద సంఖ్యలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

**- రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**- పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు..**



వేములవాడ/ప్రజాదివాస్ మే 13

వేములవాడ అర్బన్ మండలం చిర్లవంచ, గుర్రవానిపల్లె, వేములవాడ పట్టణంలో పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం లబ్ధిదారులకు నూతన వస్త్రాలను అందజేశారు..ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన గుర్రవానిపల్లె గ్రామ బస్ సెల్టర్ ను రాష్ట్ర ప్రభుత్వ విప్ ప్రారంభించారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,పేదల సొంతింటి కలను నిజం చేయడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అర్హులైన ప్రతి కుటుంబానికి గౌరవప్రదమైన నివాసం కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..

# బి ఎల్ ఓ లకు అవగాహన సదస్సు



ముస్తాబాద్/మే 13 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముసాబాద్ మండలం పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సెన్సెస్ పై మండల రెవెన్యూ అధికారి పారుక్ బిఎల్ఓ లకు సూపర్వైజర్లకు పలు రాజకీయ పార్టీ నాయకులు సర్పంచులకు ప్రజాప్రతినిధులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా ఎమ్మార్వో మాట్లాడుతూ సెన్సెస్ సర్వే నిర్వహించేటప్పుడు ఎలాంటి తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులు బాధ్యతాయుతంగా కార్యక్రమం నిర్వహించాలని వారన్నారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ బిఎల్ఓ లు సర్పంచులు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యా వారోత్సవాలు

**- ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ చైర్మన్**

మే -13 ప్రజా దివాస్




ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక విద్య వారోత్సవాలు లో భాగంగా బుధవారం రోజు పెబ్బేరు మున్సిపాలిటీ లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పట్టణ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్,మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ విజయవర్ధన్ రెడ్డి పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో విద్యశాఖ అభివృద్ధి కార్యక్రమాలను నాయకులకు కళాశాల ప్రిన్సిపాల్ వివరించడం జరిగింది. అదేవిధంగా గత సంవత్సరము డిగ్రీ పరీక్షలలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులను సన్మానించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ. వెంకట్ ప్రసాద్ మరియు అధ్యాపకులు సిబ్బంది పాల్గొనడం జరిగినది.

# ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశం ప్రారంభించిన ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్

మే -13 ప్రజా దివాస్



జగిత్యాల జిల్లా పెగడపల్లి,నంచర్ల గ్రామంలో బుధవారం తెలంగాణ ప్రజా ప్రభుత్వంద్వారా తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి. లక్ష్మణ్ కుమార్ సహకారంతో మంజూరైన ఇందిరమ్మ ఇండ్లను బుధవారం స్థానిక సర్పంచ్ ఒరుగల అరుణ- శ్రీనివాస్ కుంటాల వనజ -శ్రీనివాస్ లా తో కలిసి ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ ఈ కార్యక్రమం లో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు లింగంపల్లి మహేష్ చెట్ల కిషన్ నాయకులు ఐలేని వంశీధర్ రావు నీరటి రాజ్ కుమార్ స్థానిక ఉప సర్పంచ్ శ్యాంసుందర్ రెడ్డి పంచాయతీ నవీన్ కుమార్ వార్డు సభ్యులు మేక రాయమల్లు తడగొండ శ్రీలత సురేష్ కుంటల జమున లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు

# స్తంభంపల్లి బస్టాండ్ లో చలివేంద్రం ప్రారంభించిన సర్పంచ్ భూపల్లి.రాజయ్య

మే -13 ప్రజా దివాస్



జగిత్యాల జిల్లా వెలుగటూరు మండలం స్తంభంపల్లి గ్రామంలో బస్టాండ్ వద్ద వేసవికాలం దృశ్య ప్రయాణికులకు దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ను ఉపసర్పంచ్ యాగండ్ల గంగయ్య తో కలిసి ప్రారంభించిన సర్పంచ్ భూపల్లి రాజయ్య ఈ కార్యక్రమంలో శ్రీపాద సత్తయ్య భూపల్లి పోచయ్య శివకుమార్ గ్రామస్తులు ప్రయాణికులు తదితరులు ఉన్నారు

# గోగుల సత్యనారాయణ రెడ్డిని పరామర్శించిన చల్లా ధర్మారెడ్డి

**- పరకాల మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి**

మే -13 ప్రజా దివాస్



బుధవారం పరకాల నియోజకవర్గంలోని దామెర మండలం ఊరుగొండ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గోగుల సత్యనారాయణ రెడ్డి ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడి ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు.ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే ప్రమాదానికి సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకుని, ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.అలాగే కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో దామెర మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, యువ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలి

**- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**
**- కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారంలో కొనుగోలు కేంద్రంలో తనిఖీ**





కోనరావుపేట, మే -13 ప్రజా దివాస్

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యానికి అనుగుణంగా లారీల సంఖ్యను పెంచాలని ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆదేశించారు. కోనరావుపేట మండలం మర్తనపేట, నాగారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ బుధవారం తనిఖీ చేశారు. తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఉన్నాయా అని పరిశీలించారు. కొనుగోలుకు సంబంధించిన రిజిస్టర్లు తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ధాన్యం రాశులు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ధాన్యం కొనుగోలు వేగంగా పూర్తి చేయాలని, మిల్లులకు తరలించాలని సూచించారు. మిల్లర్లు హమాలీల సంఖ్య ను పెంచి వెంట వెంటనే ధాన్యం అన్ లోడింగ్ చేయాలని ఆదేశించారు. లారీల ట్రాన్స్పోర్ట్ కాంట్రాక్టర్లు వెంటనే వాహనాల సంఖ్య పెంచాలని, ధాన్యానికి అనుగుణంగా వాహనాలను సమకూర్చాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. టార్పాలిన్లు అందుబాటులో పెట్టాలని, వాతావరణ శాఖ హెచ్చరికలు ఎప్పటికప్పుడు రైతులకు తెలియజేయాలని సూచించారు. ధాన్యం తడవకుండా ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని ఆదేశించారు. రైతులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని తెలిపారు.తనిఖీలో డీఆర్డీఓ లక్ష్మీనారాయణ, జిల్లా పౌర సరఫరాల అధికారి బుచ్చిబాబు, మేనేజర్ నరసింహ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# బ్రెయిన్ ఇన్ఫెక్షన్‌తో పోరాడుతూ 11 ఏళ్ల నిశాంత్ కన్నుమూత

**- మామిడిపల్లి గ్రామంలో విషాదఛాయలు**





కానరావుపేట మండలం/ప్రజాదివాస్ మే 13

చదువుకుని ప్రయోజకుడై తల్లిదండ్రులను కళ్లల్లో పెట్టుకుని చూసుకుంటాడనుకున్న ఆ చిన్నారిని విధి వెక్కిరించింది. తీవ్రమైన అనారోగ్యంతో గత కొన్ని రోజులుగా మృత్యువుతో పోరాడుతున్న 11 ఏళ్ల లోకుర్తి నిశాంత్ బుధవారం చికిత్స పొందుతూ కన్నుమూశాడు. ఈ ఘటనతో కోనరావుపేట మండలం మామిడిపల్లి గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.మామిడిపల్లి గ్రామానికి చెందిన లోకుర్తి నిశాంత్ అనే బాలుడికి ఇటీవల తీవ్రమైన జ్వరం రావడంతో కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు నిశాంత్‌కు బ్రెయిన్ ఇన్ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని నీలోఫర్ ఆసుపత్రికి తరలించగా, అక్కడ ఐసీయూలో అత్యవసర చికిత్స అందించారు. నిశాంత్ కుటుంబం నిరుపేద కావడంతో భారీ మొత్తంలో అయ్యే వైద్య ఖర్చుల కోసం దాతల సాయాన్ని కోరారు. ఆ చిన్నారి ప్రాణాలు కాపాడాలంటూ సోషల్ మీడియా వేదికగా జరిగిన విజ్ఞప్తులకు పలువురు స్పందించారు. తల్లిదండ్రులు తమ బిడ్డ తిరిగి వస్తాడన్న ఆశతో నిరీక్షించినప్పటికీ, చికిత్స ఫలించక నిశాంత్ తుదిశ్వాస విడిచాడు.కళ్లముందే ఆడుకోవాల్సిన కొడుకు విగతజీవిగా పడి ఉండటం చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. బాలుడి మృతితో మామిడిపల్లి గ్రామంలో విషాదం నెలకొంది. నిశాంత్ ఆత్మకు శాంతి చేకూరాలని గ్రామస్తులు, స్థానిక నాయకులు ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

# పేదింటి ఆడబిడ్డ పెళ్లికి పుస్తె మట్టెలు అందజేత





ముస్తాబాద్ /మే 13 ప్రజా దివాస్

రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండలం బంధనకల్ గ్రామానికి చెందిన పేదింటి ఆడబిడ్డ కొమ్మట రాజవ్వ రాజు ల కూతురు వివాహానికి గూడెం గ్రామానికి చెందిన చిట్టినేని మాధవి వెంకటేశ్వరరావు దంపతులు పేదింటి ఆడబిడ్డ పెళ్ళికి పుస్తె మట్టెలు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో విద్యాసాగర్ రావు జెల్లా వెంకటస్వామి కస్తూరి కార్తీక్ రెడ్డి చిట్టినేని శ్రీనివాసరావు కేసుగాని తిరుపతి పాల్గొనడం జరిగింది ఈ సందర్భంగా చిట్టీనేని మాధవి వెంకటేశ్వరరావు దంపతులకు బంధనకల్ గ్రామ ప్రజలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

# మల్టీ స్కిల్ టెక్నీషియన్ శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు జాబ్ ఆఫర్ లెటర్ల ప్రదానం

**- గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధితో ఉపాధి అవకాశాలు**




ప్రజా దివాస్

పిపల్ ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మల్టీ స్కిల్ టెక్నీషియన్ శిక్షణా కార్యక్రమం విజయవంతంగాముగిసిందని పిపల్ ట్రీ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా శిక్షణను పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లతో పాటు జాబ్ ఆఫర్ లెటర్లను ప్రదానం చేసినట్లు తెలిపారు.సంగారెడ్డి బృందావన్ కాలనీలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి డెక్కన్ టోల్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రాజెక్ట్ హెడ్ ప్రవీణ్ ధూబే, కారిడార్ మేనేజర్ నాగరాజు, పిపల్ ట్రీ ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ సంపత్ కుమార్, ప్రాజెక్ట్ హెడ్ సురేష్ రెడ్డి, సెంటర్ హెడ్ నవీన్ గౌడ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ, గ్రామీణ యువతకు నైపుణ్యాభివృద్ధి ద్వారా స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసి ఉద్యోగ అవకాశాలు సాధించిన విద్యార్థులను అభినందించారు.శిక్షణార్థులకు సాంకేతిక మరియు ప్రాయోగిక నైపుణ్యాలను అందించిన ట్రైనర్లు ప్రశాంత్, హారికలను ప్రత్యేకంగా అభినందించారు. శిక్షణ పొందిన యువత తమ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. డెక్కన్ టోల్గేస్ ప్రైవేట్ లిమిటెడ్, సెకుర గ్రూప్ మరియు పిపల్ ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ శిక్షణా కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతున్నాయని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా మరిన్ని నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

# ఆశ్వారావుపేటలో ఘనంగా నెక్స్ట్ జనరేషన్ స్కూల్ కిడ్జీ ప్రీ స్కూల్ ప్రారంభోత్సవం

మే -13 ప్రజా దివాస్

ఆశ్వారావుపేట,: ఆశ్వారావుపేట పట్టణంలో నెక్స్ట్ జనరేషన్ స్కూల్ కిడ్జీ ప్రీ స్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమం బుధవారం ఉదయం 10.30 గంటలకు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ హాజరై పాఠశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నెక్స్ట్ జనరేషన్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ డాక్టర్ రామకృష్ణ కొలికిపోగు గత రెండు దశాబ్దాలుగా విద్యా రంగంలో సమాజ సేవ చేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లోనూ గ్లోబల్ స్టాండర్డ్స్ విద్యను అందించాలనే దృఢ సంకల్పంతో ఈ విద్యాసంస్థను స్థాపించడం అభినందనీయమని అన్నారు. ఆశ్వారావుపేట వంటి గ్రామీణ నియోజకవర్గంలో నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ఈ పాఠశాల ప్రారంభం కావడం శుభపరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, చైర్మన్ డాక్టర్ రామకృష్ణ కొలికిపోగు, మున్సిపల్ కమిషనర్ దిలీప్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ య యా తి రాజ్ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం భగవాన్ బుద్ధుడికి పూలమాల వేసి "గురు బ్రహ్మ, గురుర్ విష్ణు, గురుర్ దేవో మహేశ్వరః" శ్లోకాన్ని ఆలపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తుమ్మ రాంబాబు, స్థానిక నాయకులు జూపల్లి ప్రమోద్, చిన్నంసెట్టి సత్యనారాయణ, యుగంధర్, మున్సిపల్ కౌన్సిలర్లు కేదార్‌నాథ్, లక్ష్మణరావు, మిండా హరిబాబు, దివాకర్, స్థానిక నాయకులు జూపల్లి రమణారావు, పద్మజ, కాసానిచఃద్రమోహన్, పద్మ , డా. భూక్యా ప్రసాద్, డా. ఉదయజ్యోతి, జుజ్జూరపు శ్రీరామమూర్తి, చారుగుళ్ళ సత్యనారాయణ, నార్లపాటి శ్రీను, చీమకుర్తి కృష్ణ, కృష్ణార్జున రావు, రాంబాబు , నిర్మల, పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు. హైదరాబాద్ పర్యటనలో ఉన్న అశ్వారావుపేట మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్ జూపల్లి శశికళ - రమేష్ లు యాజమాన్యానికి ఫోన్లో శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమానికి హాజరైన ముఖ్య అతిథులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా మొట్టమొదటి అడ్మిషన్‌గా బేబీ ఎస్. హర్షిణి (శక్తివేల్ ఎస్ కుమార్తె) నర్సరీ తరగతిలో ప్రవేశం పొందింది. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో తల్లిదండ్రులు, శ్రేయోభిలాషులు, స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యారు. పాఠశాల యాజమాన్యం, సిబ్బంది గగన, సాహిత్య, సత్య తదితరులు





పాల్గొన్నారు. నాణ్యమైన విద్యతో పాటు విలువల ఆధారిత బోధన, ఆధునిక సదుపాయాలతో విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తామని పాఠశాల యాజమాన్యం వెల్లడించింది. మరిన్ని వివరాలకు తల్లిదండ్రులు 7093382986, 7093392986 నంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని తెలియజేశారు.

# భీమా క్లయిమ్ అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా



మే -13 ప్రజా దివాస్

తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన గ్రామపంచాయతీ సిబ్బంది దుర్సెట్టి ఎల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. ఎల్లయ్య నుస్తులాపూర్‌లోని బ్యాంక్ ఆఫ్ బరోడాలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి భీమా యోజన (పీఎంజేజేబీవై) పథకం కింద భీమా చేయించుకున్న నేపథ్యంలో, అతని కుటుంబానికి రూ.2 లక్షల భీమా క్లయిమ్ మంజూరైంది. ఈ మేరకు ఎల్లయ్య భార్య కనకవ్వకు బ్యాంక్ మేనేజర్ ఎ. బాలరాజు చెక్కును అందజేశారు. 18 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న ఖాతాదారులు స్వచ్ఛందంగా ఈ భీమా పథకంలో చేరాలని, ప్రతి ఏడాది మే నెలలో ప్రీమియం ఆటో డెబిట్ ద్వారా కట్ అవుతుందని బాలరాజు తెలిపారు. ఖాతాదారులంతా భీమా సదుపాయాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది సాయిరాం, కుమారస్వామి, వసుందర, ఇందుజ, అనూష తదితరులు పాల్గొన్నారు.

# రైతులను గాలికి వర్షాలకి వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మే -13 ప్రజా దివాస్


రైతుల వడ్లు మక్కలు కొనకుండా గాలివానకు వదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ మండిపడ్డారు బుధవారం జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం దొంతాపూర్, మగ్గిడి గ్రామాల్లో మక్క, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తో ఫోన్‌లో మాట్లాడి, ధాన్యం కొనుగోలులో ఆలస్యాలు, తాలు తప్ప కటింగ్ , తక్కువ మొత్తం కొనుగోలు వంటి జాప్యాలపై ఆరాతీసారు. ఇక్కడ రైతుల ఆవేదన చూస్తుంటే, ఈ సారి ప్యాడీతో పాటు మొక్కజొన్న పంటలు కూడా మన రైతులు విరివిగా పండించారని,కానీ ప్రభుత్వం ముందస్తుగా కొనుగోలు కేంద్రాలు, గోదాములు ఏర్పాటు చేసి సకాలంలో కొనుగోలు చేయాల్సిన బాధ్యత తీర్చలేదని ఆరోపించారు. జిల్లా కేంద్రంలో వరిధాన్యం, మక్కల మొత్తం అంచనా వేయకపోవడం, ముందస్తు చర్యల్లో విఫలమవడం వల్ల రైతులు 15 రోజులుగా బస్తాలు కొనుగోలు సెంటర్లో పోసి



ఎదురుచూస్తున్నారని, ఒక్క లారీ కూడా సరిగా రాలేదని, క్వింటాల్‌కు 2.5-5 కేజీలు మాత్రమే సంచికీ కట్ చేసి కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు .కలెక్టర్ కొనుగోలుకు ఏర్పాట్లు చేస్తామని తెలిపిన , వేలాది బస్తాలు కేంద్రాల వద్ద ఎందుకు ఉన్నాయని, మక్క కేంద్రాల వద్ద వందల బస్తాలు ఎందుకు ఉన్నాయని ప్రశ్నించారు. ఈ ప్రభుత్వం రైతులను శత్రువులాగా భావిస్తోందని, గత కెసిఆర్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచి, తడిసిన ధాన్యాలను కూడా కొనుగోలు చేసి సకాలంలో చెల్లింపులు చేసిన చరిత్ర గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గత పద్ధతులు కూడా నడవడం లేదని, రైతులను గాలికి వదిలేసి నష్టాలకు గురిచేస్తోందని ఆరోపించారు. జగిత్యాల జిల్లాకు మంత్రి ఉన్నారని, గతంలో బి ఆర్ ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసినప్పుడు కల్లాల చుట్టూ తిరిగారని, ఇప్పుడు రైతుల బాధలు వినడం, కేంద్రాలకు వచ్చి చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. రైతులు ప్రభుత్వంపై నమ్మకంతో ధాన్యం తెచ్చారు, వర్షాలు కురిస్తే ఏమవుతుందని, ధర్మపురి నియోజకవర్గం నుంచి రాష్ట్రమంత ఇలా ఉందని, ప్రభుత్వం ఏం చేయాలనుకుంటోందని రైతులను గాలివానకు వదిలేసారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆఫీసుల్లో కూర్చోవద్దు, ప్యాడీ-మక్క సెంటర్లకు వచ్చి రైతులతో మాట్లాడాలని, తక్షణమే లారీలు, ఏర్పాట్లు చేయాలని బి ఆర్ ఎస్ తరపున డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు ఉన్నారు

# 108 ఈఎంటి నుండి నర్సింగ్ ఆఫీసర్‌గా ప్రభుత్వ ఉద్యోగం సాధించిన కనుకుంట్ల రాజేష్

**- అభినందనలు తెలిపిన 108 రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్**



మే -13 ప్రజా దివాస్

రేగొండ మండలం కాకర్లపల్లి గ్రామం కు చెందిన కనుకుంట్ల రాజేష్ గత 16 సంవత్సరాలుగా ములుగు జిల్లాలో 108 అత్యవసర సేవలో ఈ ఎం టి గా పనిచేస్తూ ప్రజలకు కీలకమైన వైద్య సేవలు అందించారు. సేవాభావం, క్రమశిక్షణ, అంకితభావంతో వేలాది మంది ప్రాణాలను రక్షించారు. రాష్ట్ర ఆరోగ్య శాఖ ఇటీవల నిర్వహించిన నర్సింగ్ ఆఫీసర్ నియామకాల్లో రాజేష్ జోన్--1 మెరిట్‌లో ఓపెన్ కేటగిరీ ద్వారా అర్హత సాధించారు. మంగళవారం నాడు వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తన చేతుల మీదుగా ప్రభుత్వ నియామక పత్రాన్ని రాజేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా 108 తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు బాలాజీ నాయక్ రాజేష్‌కు అభినందనలు తెలుపుతూ.. ప్రజాసేవలో అంకితభావంతో పనిచేసే ఉద్యోగులకు ఇది ప్రేరణగా నిలుస్తుందని అన్నారు.

# నిరుపేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి.

మే -13 ప్రజా దివాస్

ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా.బూర్గంపాడు: : అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇండ్లు, ఇంటి స్థలాలు మంజూరు చేయాలని తెలంగాణ వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మచ్చ వెంకటేశ్వర్లు,రేపాకుల శ్రీనివాస్ లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు, బుధవారం నాడు నిరుపేద వ్యవసాయ కార్మికులతో తహసీల్దార్ కార్యాలయం వరకు ప్రదర్శనగా వెళ్లి ధర్నా నిర్వహించి తహసీల్దార్ కు వినతి పత్రం అందజేశారు,ఈ సందర్భంగా బత్తుల వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సభలో వారు మాట్లాడుతూ రెండవ విడత ఇందిరమ్మ ఇండ్లు అర్హులైన పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు, ఇంటి స్థలాలు లేని నిరుపేదలకు స్థలం ఇవ్వాలని కోరారు, అదేవిధంగా ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా వ్యవసాయ కార్మికులకు సంవత్సరానికి 12000




రూపాయలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన ఆరు గ్యారంటీలను హామీలు అమలు చేయాలని కోరారు, కేంద్ర ప్రభుత్వం ఏకపక్షంగా తీసుకువచ్చిన వీబీజీరామ్ జి చట్టాన్ని రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు,మే 15 వ తేదీన దేశవ్యాప్తంగా ఉపాధి కార్మికుల సమ్మె జరుగుతుందని తెలిపారు, ఈ సందర్భంగా బూర్గంపాడు తహసీల్దార్ ప్రసాద్ మాట్లాడుతూ తెలంగాణ వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదల సమస్యలపై ఇచ్చిన దరఖాస్తులు పరిశీలించి పేదలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు,ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బత్తుల వెంకటేశ్వర్లు, జిల్లా కమిటీ సభ్యురాలు ఎస్ కే అబీద,బయ్య రాము, మరియమ్మ ,చిన్నమ్మాయి, పద్మ, కనకదుర్గ, కుర్స తిరుపతయ్య, మంగ మీనా శివ తదితరులు పాల్గొన్నారు

# సొసైటీ గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలి ..

**- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సిద్దన రమేష్....**



మే -13 ప్రజా దివాస్

చెన్నారావుపేట మండల రైతులు సొసైటీ గోదాములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని చెన్నారావుపేట కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్ అన్నారు. ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి చొరవతో చెన్నారావుపేట మండలంలోని పాపయ్యపేట, ముక్కుంపురం, ముదిగొండ పరిధిలో 50000 బస్తాల సామర్థ్యం గల గోదాములను రైతుల ప్రయోజనార్థం ప్రారంభించారు. మార్క్ ఫెడ్ డిఎం తో మాట్లాడి రైతుల ఇబ్బందులను తొలగించేందుకు గోదాములను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ గోదాంలో రైతులు తమ మక్కజొన్నలను వేసుకోవాలని సూచించారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో చెన్నారావుపేట మక్కల కొనుగోలు కేంద్రంలో కాంటాలైన మక్కలను గోదాంలో భద్ర పరచనున్నట్లు తెలిపారు. అకాల వర్షాల వల్ల రైతులు ఇబ్బందులు పడకుండా తమ మక్కజొన్నలు తడవకుండా ఉండడం కోసం ఈ గోదాములను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కేతిడి వీరారెడ్డి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మొగిలి వెంకట్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మంద యాకయ్య గౌడ్,నాయకులు జున్నుతుల మహేందర్ రెడ్డి, ఇన్చార్జి సుమన్ రావు,సొసైటీ సీఈవో చిట్టె రవి, సొసైటీ సిబ్బంది, రాఘవులు, శ్రీనివాస్, ప్రదీప్ రైతులు పాల్గొన్నారు.

# బాన్సువాడలో జనగణనలో పాల్గొన్న ఎమ్మెల్యే పోచారం..

మే -13 ప్రజా దివాస్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ పోచారం శ్రీనివాస్ రెడ్డి బుధవారం బాన్సువాడలోని తన నివాసంలో జనగణన ప్రక్రియలో పాల్గొన్నారు. అధికారులు పోర్టల్ ద్వారా ఆయన కుటుంబ సభ్యుల వివరాలను నమోదు చేశారు. ఈ సందర్భంగా పోచారం శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి పౌరుడు జనగణనలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. జనగణన ద్వారా సేకరించే సమాచారం ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల రూపకల్పనకు, సంక్షేమ పథకాల సమర్ధవంతమైన అమలుకు ఉపయోగపడుతుందని తెలిపారు.

# ఇందిరమ్మ ఇల్లు నూతన గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు..

మే -13 ప్రజా దివాస్



బీబీపేట్ మండలం తుజాల్‌పూర్ గ్రామంలో బుధవారం నిర్వహించిన జంగం బాలకృష్ణ నూతన గృహప్రవేశ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఇందిరమ్మ కమిటీ సభ్యులు కలకుంట్ల రాజు, సయ్యద్ హుస్సేన్ హాజరుకాగా, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అక్కమొల్ల రాజు మరియు పార్టీ కార్యకర్తలు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలకుంట్ల రాజు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా అనేక మంది పేద కుటుంబాల సొంతింటి కల సాకారం అవుతోందని తెలిపారు. ప్రభుత్వం పేదల సంక్షేమానికి కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఉప్పునుంతల మండలానికి చెందిన ఇద్దరికి గాయాలు

**ఒకరి పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్ కు తరలింపు**

మే -13 ప్రజా దివాస్



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం వంగూరు మండలం తుమ్మలపల్లి గ్రామం వద్ద శ్రీశైలం హైదరాబాద్ ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారని స్థానికులు తెలిపారు. వివరాల్లోకి వెళితే ఉల్పర కి చెందిన యాదవ్ (25) ఉప్పునుంతల మండలం పెద్దాపూర్ కి చెందిన సాయి ముదిరాజ్ (27) హాజీపూర్ నుంచి హైదరాబాద్ వెళుతున్న క్రమంలో ప్రమాదానికి గురయ్యారన్నారు. వారిని 108 అంబులెన్స్ లో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అందులో బబుల్ యాదవ్ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్య సేవల కోసం హైదరాబాదుకు తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# అమ్రాబాద్ మండల నూతన ఎమ్మార్వో గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర రెడ్డి

**శాలువాతో సన్మానించిన అమ్రాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు**

మే -13 ప్రజా దివాస్



నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం అమ్రాబాద్ మండల ఎమ్మార్వో గా బాధ్యతలు చేపట్టిన వెంకటేశ్వర రెడ్డి గారిని మర్యాదపూర్వకంగా కలిసి అమ్రాబాద్ మండల కాంగ్రెస్ నాయకులు శాలువాతో సన్మానించి అభినందించడం జరిగింది. అనంతరం మండలంలోని పలు సమస్యలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు. మండల ప్రజలకు అన్నివేళలా అందుబాటులో ఉంటానని ఎమ్మార్వో వెంకటేశ్వర రెడ్డి హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిసిసి జిల్లా ప్రధాన కార్యదర్శి కోరే రేణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి హరి నారాయణ గౌడ్, అమ్రాబాద్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ఎండి రహీమ్, అమ్రాబాద్ సర్పంచ్ కోటి, సింగల్ విండో డైరెక్టర్ చారకొండ సైదులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయొద్దు.

**- చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ - జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇంచార్జీ డాక్టర్ భోగ శ్రావణి**

మే -13 ప్రజా దివాస్

విద్యార్థుల భవిష్యత్తు రాజకీయాలు చేయొద్దు నవోదయ పాఠశాల ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలి అని చదువుల తల్లి స్థలం కోసం ఎంపీ అరవింద్ ధర్మదీక్ష చేస్తున్నారని అందుకు ప్రజలు విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చిన జగిత్యాల బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జ్ భోగ శ్రావణి జగిత్యాల జిల్లా రాయికల్ పట్టణంలో బుధవారం జగిత్యాల్ బీజేపీ నియోజకవర్గ ఇన్చార్జి భోగ శ్రావణి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ. విద్యార్థుల భవిష్యత్తు కోసం నిజామాబాద్ ఎంపీ చేపట్టనున్న ధర్మదీక్షకు ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని పిలుపునిచ్చారు చదువుల తల్లి స్థలం కోసం, కేంద్ర ప్రభుత్వం నవోదయ పాఠశాల మరియు కేంద్రీయ విద్యాలయాల ఏర్పాటుకు మంజూరు చేసి అనుమతిస్తే రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించకుండా ఇబ్బందులు చేస్తున్నా రని వెంటనే స్థలం కేటాయించాలని ఆమె డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం విద్యాభివృద్ధి కోసం ముందుకు వచ్చి పాఠశాలలను మంజూరు చేసినప్పటికీ, రాష్ట్ర



ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా స్థలం కేటాయించకుండా జాప్యం చేస్తోందని విమర్శించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం రాజకీయ కుట్రలతో విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల నియోజకవర్గంలో కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియాల్సిందిగా నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అరవింద్ ధర్మపురి ని అడిగిన వెంటనే వారు పిల్లల భవిష్యత్తు కోసం కేంద్రీయ విద్యాలయాన్ని మంజూరు చేపియడం జరిగింది. కానీ స్థలం కేటాయింపులో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. పక్కనే ఉన్న కోరుట్ల నియోజకవర్గంలో ఇప్పటికే నవోదయ పాఠశాల ప్రారంభమై అడ్మిషన్లు కూడా కొనసాగుతున్నాయని గుర్తు చేశారు. జగిత్యాలలో కూడా సమయానికి స్థలం కేటాయించి ఉంటే ఇప్పటికి పాఠశాల ప్రారంభమై విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేదని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, స్థానిక నాయకుల నిర్లక్ష్యం వల్ల రెండు సంవత్సరాలుగా విద్యార్థులు నష్టపోతున్నారని, వారి భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారిందని అన్నారు. విద్యాభివృద్ధిలో కూడా రాజకీయాలు చేయడం సిగ్గుచేటని మండిపడ్డారు. ఈ నెల 15వ తేదీ లోపు రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించాలని గడువు ఇచ్చామని, ఆలోపు చర్యలు తీసుకోకపోతే జగిత్యాల జిల్లా కేంద్రంలోని తహసీల్దార్ చౌరస్తా వద్ద అంబేద్కర్ విగ్రహం ఎదుట ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. ఈ ధర్మదీక్షకు బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, మాజీ ప్రజాప్రతినిధులు హాజరై విజయవంతం చేయనున్నారని తెలిపారు. జగిత్యాల నియోజకవర్గ ప్రజలు, రాయికల్ పట్టణం మరియు మండల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని డాక్టర్ భోగ శ్రావణి కోరారు. ఈ కార్యక్రమంలో రాయికల్ పట్టణ అధ్యక్షులు కుర్మా మల్లారెడ్డి, రాయికల్ మండల్ అధ్యక్షులు ఆకుల మహేష్, రాయికల్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కల్లెడ ధర్మపురి, 11వ వార్డ్ కౌన్సిలర్ పుర్రె శ్రీధర్, మాపాక్స్ చైర్మన్ ముత్యం రెడ్డి, కునారపు భూమేష్, రవీందర్ రెడ్డి, వేముల రాము, తోపారపు సురేష్, పటేల్ రాము, సమల్ల సతీష్, సింగని సతీష్, విజయ్ మరియు బిజెపి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఎండుతున్న చెట్లు... నిర్లక్ష్యంలో పంచాయతీ కార్యదర్శి..

మే -13 ప్రజా దివాస్

మద్నూర్ మండలం అంతాపూర్ గ్రామంలో మందుబాబులకు, ఆకతాయులకు అడ్డాగా మారిన పల్లె ప్రకృతి వనం... గ్రామంలో పంచాయతీ కార్యదర్శి నవీన్ ఉన్నారా.. లేరా.. అనే ప్రశ్న గ్రామ ప్రజల్లో వ్యక్తమవుతోంది. గ్రామ ప్రజలు పంచాయతీ కార్యదర్శి నవీన్‌ను విధులు సక్రమంగా నిర్వహించాలని కోరితే, ఇష్టారీతిన మాట్లాడుతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి వెంటనే పంచాయతీ కార్యదర్శి నవీన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. పల్లెల్లో ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేందుకు గత ప్రభుత్వం గ్రామ గ్రామాన పల్లె ప్రకృతి వనాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. పండ్లు, పూల మొక్కలతో పాటు వివిధ రకాల చెట్లను పెంచి గ్రామాలను పచ్చదనంతో నింపాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. అయితే క్షేత్రస్థాయిలో ప్రస్తుతం పరిస్థితి పూర్తిగా అధ్వానంగా మారిందని గ్రామస్తులు మండిపడుతున్నారు. నీటి కొరతతో చెట్లు ఎండిపోతుండగా, వాటిని పట్టించుకునే పరిస్థితి లేదని ఆరోపిస్తున్నారు. "గ్రామంలో పంచాయతీ కార్యదర్శి ఉన్నాడా.. ఉంటే ఒక్కరోజైనా ప్రకృతి వనం వైపు వచ్చారా.. ఎండిపోతున్న చెట్లు కనిపించడం లేదా.." అంటూ గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. మద్నూర్ మండలంలోని అంతాపూర్ గ్రామ పల్లె ప్రకృతి వనం ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండిపోయి నిర్లక్ష్యానికి గురైంది. చెట్లకు నీరు అందక అవి ఎండిపోతున్నాయి. గత ప్రభుత్వం చెట్లకు నీరు సరఫరా చేయడానికి ట్రాక్టర్లు అందించినప్పటికీ,




సంబంధిత అధికారులు మరియు సిబ్బంది చెట్ల సంరక్షణపై ఏమాత్రం శ్రద్ధ చూపడం లేదని గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు చొరవ తీసుకుని అంతాపూర్ గ్రామంలోని ఎండిపోతున్న మొక్కలకు వెంటనే నీటిని అందించి, పల్లె ప్రకృతి వనాన్ని పరిరక్షించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మానవతా దృక్పథంతో ముంపు భూముల ధాన్యం కొనాలి

**- ఎల్ఎండీ పరిధి రైతుల గోడు**
**- తహసీల్దార్‌కు బాధిత రైతుల వినతిపత్రం**

మే -13 ప్రజా దివాస్

ముంపు ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్‌కు దూరంగా ఉన్న ఖాళీ భూముల్లో సాగు చేసిన వరి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ రామకృష్ణకాలనీ గ్రామానికి చెందిన బాధిత రైతులు బుధవారం మండల తహసీల్దార్ కర్ర శ్రీనివాస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఎల్ఎండీ రిజర్వాయర్ పరిధిలో ముంపుకు గురైన తమ స్వంత భూముల్లో సుమారు 70 మందికి పైగా రైతులు గత 25 ఏళ్లుగా వ్యవసాయం చేసుకుంటూ



కుటుంబాలను పోషించుకుంటున్నారని వారు వివరించారు. అయితే ప్రస్తుతం ఆ భూముల్లో పండించిన వరి ధాన్యాన్ని స్థానిక కొనుగోలు కేంద్రాలు స్వీకరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల వెంట వచ్చిన బీజేపీ నాయకులు, న్యాయవాది సుగుర్తి జగదీశ్వరాచారి మాట్లాడుతూ.. వ్యవసాయం తప్ప ఇతర ఉపాధి తెలియని ఈ రైతుల పరిస్థితిని మానవతా దృక్పథంతో పరిశీలించి ధాన్యం కొనుగోలు చేయాలని కోరారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఇలాంటి సమస్యలు తలెత్తినప్పుడు రైతుల ధ్రువీకరణ పత్రాల ఆధారంగా వ్యవసాయ అధికారుల అనుమతితో ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని గుర్తుచేశారు. అదే విధానాన్ని అమలు చేసి సమస్యను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. రైతులు గోనెల భూమయ్య, గంగు రాజమల్లు, కోతి మల్లేశం, ఆవుల లచ్చయ్య, గంగు తిరుపతి, అట్ల అంజయ్య తదితరులు తహసీల్దార్‌ను కలిసి తమ సమస్యను వివరించారు. వారి వెంట బీజేపీ నాయకులు గద్దం అరుణ్, కోతి రాజు పాల్గొన్నారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

# వివాహ వార్షికోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమం

**- కల్లూరు బస్టాండ్‌లో ఉచిత మజ్జిగ పంపిణీ: రోజ్ వేణు సావిత్రి**

మే -13 ప్రజా దివాస్

వేసవి తీవ్రత మధ్య ప్రయాణికులకు ఉపశమనం కలిగించేలా ఆదర్శ దంపతులు జానపాటి రోజ్ వేణు సావిత్రి తమ వివాహ వార్షికోత్సవాన్ని సేవా కార్యక్రమంతో గుర్తుంచుకునేలా జరుపుకున్నారు. వారి కుమార్తెలు దీప్తి, సుష్మ సౌజన్యంతో బుధవారం కల్లూరు బస్టాండ్‌లో ప్రయాణికులు, ఆర్టీసీ సిబ్బందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. వేసవి వేడిలో వడదెబ్బ నుండి రక్షణ కలిగించే ఈ కార్యక్రమం స్థానికంగా ప్రశంసలు అందుకుంది. ఈ సందర్భంగా టీం సత్తుపల్లి సభ్యులు, ప్రయాణికులు, కల్లూరు ప్రజలు దంపతులకు వివాహ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో వేడుకలు జరుపుకోవడం అభినందనీయమని పేర్కొంటూ,



ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింతగా కొనసాగాలని ఆకాంక్షించారు. ఉచిత మజ్జిగ పంపిణీ చేసిన జానపాటి రోజ్ వేణు, సావిత్రి దంపతులకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది యంగల వెంకటేశ్వర్లు, జొన్నలగడ్డ సురేష్, షేక్ సలీం, పోతురాజు రాము, జానపాటి దీప్తి సుష్మ శృతి కీర్తి జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

# 550 పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు ఐవిఎఫ్ ఆధ్వర్యంలో అభినందన సన్మానం..

మే -13 ప్రజా దివాస్

ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ (ఐవిఎఫ్) కామారెడ్డి జిల్లా విభాగం ఆధ్వర్యంలో 2026 పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో 550 మరియు అంతకంటే పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులకు అభినందన సన్మాన కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కమిటీ ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని ఈ నెల 25వ తేదీ సోమవారం సాయంత్రం 4 గంటలకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచి అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా 550కి పైగా మార్కులు సాధించిన ఆర్యవైశ్య విద్యార్థులను సన్మానించనున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ శ్రీమతి కల్వ




సుజాత గుప్త, ఐవిఎఫ్ జాతీయ సీనియర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పల శ్రీనివాస్ గుప్త, హైదరాబాద్ రేంజ్ జైళ్ల శాఖ డీఐజీ డాక్టర్ దుద్దెల శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను అభినందించనున్నట్లు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అర్హులైన ఆర్యవైశ్య విద్యార్థులు తమ వివరాలను ఈ నెల 18వ తేదీలోపు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ బాలు (9492874006) కు వాట్సాప్ ద్వారా పంపించాలని సూచించారు. గడువు లోపు వచ్చిన వివరాల ఆధారంగానే సన్మాన కార్యక్రమంలో అవకాశం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. అలాగే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా వ్యాప్తంగా ఉన్న ఆర్యవైశ్య సంఘాలు, వాసవి క్లబ్‌లు, పట్టణ వైశ్య సంఘాలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాలకు జిల్లా అధ్యక్షుడు ఎర్రం చంద్రశేఖర్ (9849601438), ప్రధాన కార్యదర్శి దొంతి సుధాకర్ (9440054065), కోశాధికారి కస్వ వెంకటేష్ (9848280665), ఐవిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు చిలువేరి మారుతి (9885707042), ఎర్రం విజయ్ కుమార్ (9491461854)లను సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆధ్యాత్మిక విభాగం అధ్యక్షులు ఎల్లంకి సుదర్శన్, సలహాదారులు మందుల రామచంద్రం తదితరులు పాల్గొన్నారు.

# పలు శుభకార్యాలలో పాల్గొన్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్

మే -13 ప్రజా దివాస్

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజరాంపల్లి మాజీ ఎంపీటీసీ గాజుల మల్లేశం తమ్ముడి కుమారుడి వివాహ ఇటువలే జరగగా వారి స్వగృహం కు వెళ్లి నూతన వధూవరులను



ఆశీర్వదించిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ అనంతరం వెలగటూర్ మండలం శాఖపూర్ గ్రామ వాస్తవ్యులు టిఆర్ఎస్ పార్టీ నాయకులు బాల్సాని రవి గౌడ్ నూతన గృహప్రవేశ శుభ కార్యక్రమానికి హాజరై శు భాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి కొప్పుల వెంట వెల్గటూర్ మాజీ ఏఎంసి చైర్మన్ ప్రత్తిపాక వెంకటేశ్వష్ వర్మ మండల బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షులు చల్లూరి రామ్ చందర్ గౌడ్ ప్రధాన కార్యదర్శి జూపాక కుమార్ రాజారాంపల్లి మాజీ ఎంపిటిసి గాజుల మల్లేశం ఎండపల్లి మండల బి ఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్ కొప్పుల సురేష్ కుమ్మరి వెంకటేష్ మెరుగు అశోక్ రంగు తిరుపతి చందు పడిధం వెంకటేష్ మూగల సత్యం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

## ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ :జువ్వాడి. నర్సింగరావు

మే -13 ప్రజా దివాస్

తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గా నియామకమైన జగిత్యాల జిల్లా కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు బుధవారం హైదరాబాదులో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇన్చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అనంతరం బోధన్ ఎమ్మెల్యే ప్రభుత్వ సలహాదారు (ప్రధాన పథకాల అమలు మరియు అభివృద్ధి కార్యక్రమాలు తెలంగాణ ప్రభుత్వం) సుదర్శన్ రెడ్డిని హైదరాబాదులో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించిన తెలంగాణ రాష్ట్ర నిలమ కార్పొరేషన్ చైర్మన్ కోరుట్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ జువ్వాడి నర్సింగరావు అంతకుముందు తెలంగాణ రాష్ట్ర వెల్మ కార్పొరేషన్ చైర్మన్ గా నియామకం అయిన కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగరావు ను మర్యాదపూర్వకంగా కలిసిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ గా నియామకం అయిన



జువ్వాడి నర్సింగరావును శాలువాతో సన్మానించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులున్నారు

# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో పాల్గొన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

మే -13 ప్రజా దివాస్



జగిత్యాల జిల్లా ధర్మపురి పట్టణ కేంద్రంలోని స్థానిక హనుమాన్‌వాడలో, మరియు బుద్దేశ్‌పల్లె గ్రామంలోని కదారి గంగాధర్ నూతన ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ ఆయా కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు సొంతింటి కల నెరవేరుతోందని, అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని మంత్రి స్పష్టం చేశారు ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ సంగనభట్ల దినేష్ శర్మ మున్సిపల్ చైర్మన్ వేముల నాగలక్ష్మి రాజేష్ ఏఎంసీ చైర్మన్ చిలుముల లావణ్య లక్ష్మణ్ స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు మరియు అభిమానులు పాల్గొన్నారు.

# నీట్ పరీక్ష రద్దుకు కేంద్రమే బాధ్యత వహించాలి..

**- జిల్లా కాంగ్రెస్ నాయకులు నాగరాజ్ గౌడ్**

మే -13 ప్రజా దివాస్

నీట్ పరీక్ష రద్దుకు పూర్తిగా కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని జిల్లా కాంగ్రెస్ నాయకులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. (నీట్. యు.జి.) 2026 పరీక్ష ప్రశ్నపత్రం రాజస్థాన్‌లో లీక్ అయిన నేపథ్యంలో పరీక్షను రద్దు చేసి తిరిగి నిర్వహించడం కేంద్ర ప్రభుత్వం, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) వైఫల్యమేనని ఆయన విమర్శించారు. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం



ఆటలాడుతోందని, దీనికి కేంద్ర ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏడాది పేపర్ లీకులు, అక్రమాల కారణంగా విద్యార్థుల భవిష్యత్తు, తల్లిదండ్రుల కష్టం వృథా అవుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మళ్లీ పరీక్ష నిర్వహణ కారణంగా కౌన్సెలింగ్, అడ్మిషన్లు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, దీనివల్ల విద్యార్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారని పేర్కొన్నారు. అకాడమిక్ ఇయర్ దెబ్బతినకుండా కేంద్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. నీట్ పరీక్ష నిర్వహణలో ఎన్‌టీఏ బాధ్యతారహితంగా వ్యవహరించిందని ఆరోపిస్తూ, ఈ ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ తరఫున డిమాండ్ చేస్తున్నామని నాగరాజ్ గౌడ్ తెలిపారు.

# కంకర పరిచారు కానీ రోడ్డు వేయడం మరిచారు.... గ్రామస్తులు

**- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, స్థానికులు**

మే -13 ప్రజా దివాస్

నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేట మండలం గుంపన్ పల్లి గ్రామంలోకి రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయని గ్రామస్తులు తెలియజేశారు. గుంపన్ పల్లి నుంచి నక్కర్ల పెంట మరియు శంకరయ్య గుట్ట అదేవిధంగా దర్శన్ గడ్డ తండాకి వెళ్లే దారిలో నెలల క్రితం కంకర పరిచిన కాంట్రాక్టర్ ఇంతవరకు బీటీ రోడ్డు వేయడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో కంకర తేలి వాహనదారులు మరియు స్థానికులు ప్రయాణానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నడుచుకుంటూ వెళ్లే వారికి కంకర వల్ల ఇబ్బంది కలుగుతుందని తెలిపారు. రాత్రి సమయంలో అయితే ప్రయాణం చేయడమే చాలా కష్టంగా ఉందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బీటీ రోడ్డు నిర్మాణ పనులు నత్త నడకలా సాగిస్తున్నారు తప్ప పూర్తి చేయడం లేదని మూడు గ్రామాలకు సంబంధించిన గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పై అధికారులు వెంటనే స్పందించి పెండింగ్ లో ఉన్న బీటీ రోడ్డు పనులను పూర్తి చేయాలని



గ్రామస్తులు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇలాగే ఉంటే రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని స్థానికులు తెలిపారు.

# మంత్రి అడ్లూరిని కలిసిన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య

మే -13 ప్రజా దివాస్

రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ను నూతన మార్కెట్ కమిటీ చైర్మన్ ఆకుల నరసయ్య బుధవారం కరీంనగర్లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పూల మొక్క అందించి శాలువాతో సత్కరించారు. మార్కెట్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆకుల నరసయ్యకు మంత్రి అభినందనలు తెలిపారు. రైతులకు



మార్కెట్ కమిటీ ద్వారా మెరుగైన సేవలు అందించాలని సూచించారు. రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించడంతో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన రైతులకు చేరేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కరీంనగర్ మార్కెట్ యార్డ్ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని మంత్రి హామీ ఇచ్చారు. మార్కెట్ కమిటీ పరిధిలో ధాన్యం కొనుగోళ్లు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.



# మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిసిన నూతన డిజిపి సీవీ ఆనంద్

మే -13 ప్రజా దివాస్

తెలంగాణ రాష్ట్ర డీజీపీగా నూతనంగా పదవి బాధ్యతలు స్వీకరించిన సీవీ ఆనంద్ మంగళవారం రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ను హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు

ప్రజా దివాన్ తెలుగు దినపత్రిక
గురువారం 14-05-2026

# వరుస ఫ్లాపులతో ముందు జాగ్రత్త
## రెమ్యూనరేషన్ భారీగా తగ్గించుకున్న రవితేజ




మాస్ మహారాజా రవితేజ గత కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద సరైన విజయాన్ని అందుకోలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఒకప్పుడు వరుస హిట్లతో టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక మార్కెట్‌ను సృష్టించుకున్న రవితేజ, ఇప్పుడు వరుస పరాజయాలతో కెరీర్‌లో వైఫల్య దశను ఎదుర్కొంటున్నారు. ఇటీవల విడుదలైన సినిమాలు ప్రేక్షకులను ఆశించిన స్థాయిలో ఆకట్టుకోకపోవడంతో, ఆయన తన తదుపరి ప్రాజెక్టుల విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఇప్పటివరకు కమర్షియల్ ఎంటర్‌టైనర్స్‌తో ప్రేక్షకులను అలరించిన రవితేజ, ఇప్పుడు మార్కెట్ పరిస్థితులను బట్టి తన నిర్ణయాల్లో మార్పులు చేస్తున్నారని తెలుస్తోంది. ముఖ్యంగా రెమ్యూనరేషన్ విషయంలో ఆయన తీసుకున్న తాజా నిర్ణయం చిత్రసీమలో హాట్ టాపిక్‌గా మారింది. ఒకప్పుడు సినిమా కోసం రూ.25 కోట్ల వరకు పారితోషికం తీసుకున్న రవితేజ, ప్రస్తుతం తన రెమ్యూనరేషన్‌ను రూ.15 కోట్లకు తగ్గించుకున్నారని ప్రచారం. నిర్మాతలపై అదనపు భారం పడకుండా ఉండాలనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నారని టాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. వరుస డిజాస్టర్ల తర్వాత మార్కెట్‌లో తన స్థాయిని మళ్లీ నిలబెట్టుకోవాలంటే ముందుగా మంచి విజయాన్ని అందుకోవాల్సిన అవసరం ఉందని రవితేజ భావిస్తున్నారట. అందుకే ప్రస్తుతం కథల ఎంపికలో కూడా ఆయన చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ప్రస్తుతం రవితేజ నటిస్తున్న తాజా చిత్రం 'ఇరుముడి' పై ఇండస్ట్రీలో మంచి ఆసక్తి నెలకొంది. దర్శకుడు శివ నిర్వాణ తెరకెక్కిస్తున్న ఈ సినిమా రవితేజ కెరీర్‌లో పూర్తిగా భిన్నమైన ప్రయత్నంగా చెబుతున్నారు. ఇప్పటివరకు ఎక్కువగా మాస్, కామెడీ, యాక్షన్ ఎంటర్‌టైనర్స్ చేసిన రవితేజ, ఈసారి థ్రిల్లర్ జానర్‌ను ఎంచుకోవడం అభిమానుల్లో ఆసక్తిని పెంచుతోంది. 'ఇరుముడి' సినిమా కథ, ట్రీట్‌మెంట్, రవితేజ పాత్ర పూర్తిగా కొత్తగా ఉండబోతున్నాయని సమాచారం. ఈ సినిమా విజయమే ఇప్పుడు ఆయన కెరీర్‌కు చాలా కీలకంగా మారింది. ఒకవేళ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద భారీ విజయం సాధిస్తే రవితేజ మళ్లీ ఫామ్‌లోకి రావడం ఖాయమని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు.. ప్రముఖ సింగర్‌కు జైలు శిక్ష

ప్రముఖ పాప్ సింగర్ బ్రిట్నీ స్పియర్స్ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నేరాన్ని అంగీకరించారు. దక్షిణ కాలిఫోర్నియాలో మార్చిలో ఆమెపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదైన విషయం తెలిసిందే. దీనిపై సోమవారం విచారణ జరగ్గా.. ఆమె నేరాన్ని అంగీకరించారు. దీంతో ఆమెకు వెంచురా కౌంటీ సుపీరియర్ కోర్టు ఒకరోజు జైలు శిక్షతో పాటు కొన్ని నిబంధనలు విధించింది. శిక్షతో పాటు ఆమె భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం చేయకుండా ఉండటానికి కోర్టు పలు కీలక ఆదేశాలు జారీ చేసింది. మూడు నెలల పాటు ప్రభుత్వం నిర్వహించే డ్రంక్ అండ్ డ్రైవ్ అవగాహన కార్యక్రమంలో పాల్గొనాలని ఆదేశించింది. ప్రతి వారం థెరపీ సెషన్లకు హాజరుకావాలని, నెలకు రెండుసార్లు తప్పనిసరిగా సైకియాట్రిస్ట్‌ను కలవాలని సూచించింది.




## విడాకుల జాబితాలో మరో నటి
## భర్తను అన్ ఫాలో చేసిన మౌనీరాయ్



నటి మౌనీరాయ్ వ్యక్తిగత జీవితానికి సంబంధించిన ఒక వార్త కొన్ని రోజులుగా నెట్టింట వైరల్ అవుతోంది. భర్త సూరజ్ నంబియార్‌తో ఆమె విడిపోతున్నట్లు నెట్టింట ప్రచారం జరుగుతోంది. తాజాగా ఈ వార్తలకు బలం చేకూర్చేలా ఇన్‌స్టాగ్రామ్‌లో వీరిద్దరూ ఒకరికొకరు అన్‌ఫాలో చేసుకున్నారు. ఎప్పుడూ సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉండే మౌనీ రాయ్ తనకు సంబంధించిన విషయాలను పంచుకుంటూ టూర్స్ ఫొటోలను షేర్ చేస్తుంటారు. కొన్ని రోజులుగా భర్తతో ఉన్న ఫొటోలు పోస్ట్ చేయలేదు. మరోవైపు సూరజ్ నంబియార్ ఇన్‌స్టాలో పెళ్లి ఫొటోలు కూడా కనిపించడం లేదు. అలాగే రూమర్స్‌ను ఇద్దరూ ఖండించకపోవడంతో ఈ అంశం చర్చనీయాంశంగా మారింది. 2022 జనవరిలో తన ప్రియుడు సూరజ్ నంబియార్‌ను మౌనీరాయ్ గోవాలో వివాహం చేసుకున్న విషయం తెలిసిందే. సినిమాల విషయానికొస్తే.. మౌనీరాయ్ 'విశ్వంభర'లో ఓ స్పెషల్ సాంగ్ చేసినట్లు సమాచారం. చిరంజీవి హీరోగా వశిష్ఠ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందుతోంది. చిరంజీవి సూపర్ హిట్ సినిమా 'ఖైదీ'లోని రగులుతోంది మొగలిపొద.. పాట రీమేక్‌కు మౌనీరాయ్‌తో కలిసి చిరు మరోసారి మెస్మరైజ్ చేయనున్నట్లు తెలుస్తోంది.

## కమల్-రజనీ మూవీలో త్రిష




తమిళనాడులో ఎన్నికల సందడి మొదలు... గత కొన్ని రోజులుగా త్రిష పేరు మార్మోగిపోతోంది. ముఖ్యమంత్రిగా తమిళ సూపర్‌స్టార్ విజయ్ ప్రమాణ స్వీకారోత్సవంలోనూ త్రిష ప్రధాన ఆకర్షణగా నిలిచారు. తమిళనాడు రాజకీయాల్లోకి ఆమె కూడా ప్రవేశిస్తారన్న ప్రచారం సామాజిక మాధ్యమాల్లో మొదలైంది. అయితే ఆమె వరుస సినిమాలతో సందడి చేయబోతోంది. మరోవైపు కొత్త ప్రాజెక్టుల విషయంలోనూ ఆమె పేరు బలంగా వినిపిస్తోంది. రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి చేయనున్న సినిమాలోనూ త్రిష కథానాయికగా నటించనున్నట్టు సమాచారం. నాలుగున్నర దశాబ్దాల తర్వాత రజనీకాంత్, కమల్‌హాసన్ కలిసి ఓ సినిమా చేస్తున్న సంగతి తెలిసిందే. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆ సినిమాలోనే త్రిష ఓ కథానాయికగా నటించనున్నట్టు తెలుస్తోంది. అదే నిజమైతే ఈ కలయిక మరింత ప్రత్యేకం కానుంది. దీనిపై త్వరలోనే స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరైన అనంతరం ఇన్‌స్టాలో ఓ పోస్ట్‌ని పంచుకున్నారు త్రిష. ప్రేమ ఎప్పుడూ గట్టిగానే వినిపిస్తుంది... అనే వ్యాఖ్యని జోడిస్తూ, తన ముస్తాబు వెనకున్న తన బృందానికి కృతజ్ఞతలు చెప్పింది.



## ప్రియాంకకు గ్లోబల్ వాన్‌గార్డ్ గౌరవం

ఈ మధ్య ఎప్పటికప్పుడు అంతర్జాతీయ వేడుకల్లో ప్రెజెంటర్‌గా రెడ్‌కార్పెట్‌పై హొయలొలికిస్తూ కనిపిస్తున్నారు బాలీవుడ్ అందాల తార ప్రియాంక చోప్రా. ఇప్పుడదే ప్రపంచ వేదికపై ప్రతిష్ఠాత్మకంగా భావించే గ్లోబల్ వాన్‌గార్డ్ ఆనర్ పురస్కారాన్ని ఆమె అందుకున్నారు. ఈ విషయాన్ని ప్రియాంక ఇన్‌స్టా వేదికగా పంచుకున్నారు. "ఈ గౌరవంతో పాటు ఇక్కడ ఉన్న సమూహంలో నేను భాగమయ్యాననే అనుభూతిని కలిగించినందుకు గోల్డెన్ హౌస్ వారికి ధన్యవాదాలు. ఇప్పటి వరకు నా ప్రయాణంలో సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞురాలిని"అనే క్యాప్షన్‌ని పేర్కొన్నారు. ఇటీవల లాస్ ఏంజెలెస్‌లోని మ్యూజిక్ సెంటర్‌లో జరిగిన గోల్డ్ హౌస్ అయిదవ ఎడిషన్ గోల్డ్ గాలాకు ఆమె హాజరయ్యారు. ఆసియా పసిఫిక్‌తో పాటు పాశ్చాత్య వినోద రంగంలో సంస్కృతులను అనుసంధానించడంలో గణనీయమైన కృషి చేసినందుకుగానూ.. ప్రియాంక 25 ఏళ్ల కెరీర్‌ని గుర్తిస్తూ ఈ పురస్కారం ఆమెను వరించింది. ప్రపంచవ్యాప్తంగా ఆసియా పసిఫిక్ ప్రాంతానికి చెందిన సంస్కృతి, వినోదంతో కూడిన పలు రంగాలలో అత్యంత ప్రభావవంతులైన వంద మందిని సత్కరించే వేడుక గోల్డ్ గాలా. ఈ ఏడాది 'ఏ న్యూ గోల్డ్ వరల్డ్' అనే థీమ్‌తో జరిగింది. ఇటీవలే 'సిటాడెల్ 2'లో కనిపించారు ప్రియాంక. ప్రస్తుతం దర్శకుడు రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' చిత్రంతో బిజీగా ఉన్నారు.

## శ్రీనివాస మంగాపురం సెకండ్ సింగిల్ ప్రోమో




మంగళవారం సినిమా హిట్ తరువాత అజయ్ భూపతి దర్శకత్వం వహిస్తోన్న చిత్రాల్లో శ్రీనివాస మంగాపురం ఒకటి. ఘట్టమనేని వారసుడు జయకృష్ణ హీరోగా పరిచయమవుతోన్న ఈ చిత్రంలో బాలీవుడ్ భామ రవీనా టాండన్ కుమార్తె రషా తడానీ హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రం నుంచి రిలీజైన పోస్టర్స్, సాంగ్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ సినిమాను వైజయంతీ మూవీస్ బ్యానర్ పై అశ్వినీదత్ సమర్పించడం మరింత బజ్ ని క్రియేట్ చేసింది. తాజాగా శ్రీనివాస మంగాపురం నుంచి సెకండ్ సింగిల్ ప్రోమోను మేకర్స్ రిలీజ్ చేశారు. మంగా మంగా అంటూ సాగే ఈ సాంగ్ ఆద్యంతం ఆకట్టు కొంటుంది. తిరుపతిలో జరిగే ప్రేమకథగా శ్రీనివాస మంగాపురం తెరకెక్కుతోంది. కొత్తగా తిరుపతి కొచ్చిన కుర్రోళ్ళని బతకనివ్వరా..? అన్నదమ్ములు లేరా మీకు? అంటూ హీరో.. హీరోయిన్ అందాన్ని చూసి మైమరచిపోయి.. ఆమెపై ఉన్న ప్రేమ భావాలను తెలిపుతున్నట్లు లిరిక్స్ వింటుంటే అర్థమవుతోంది.జీవీ ప్రకాష్ కుమార్ సంగీతం అందించిన ఈ సాంగ్ కి కాసర్ల శ్యామ్ లిరిక్స్ అందించాడు. ఇక రేవంత్ తన వాయిస్ తో ఈ సాంగ్ ని నెక్స్ట్ లెవెల్ కి తీసుకెళ్లాడు. జయకృష్ణ క్యూట్ స్టెప్స్, మాస్ లుక్, రషా అందం, విజువల్స్ అదిరిపోయాయి. మే 13 న ఫుల్ సాంగ్ ను రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ప్రస్తుతం షూటింగ్ జరుపుకొంటున్న ఈ చిత్రం త్వరలోనే రిలీజ్ కి సిద్ధమవుతోంది.